


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 231, పేజీలు - 08

గురువారం, జనవరి 2, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# న్యూ ఇయర్ కిక్

## మద్యం మంచినీళ్లలా తాగేశారు

**- రికార్డు బ్రేక్ చేసిన మందుబాబులు**

**- సర్కార్‌కు కాసుల పంట- ఎక్సైజ్‌శాఖకు కిక్కే కిక్కు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** న్యూ ఇయర్ వేళ రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. మందుబాబులు మద్యాన్ని మంచినీళ్లలా తాగేశారు. రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరగటంతో సర్కార్‌కు కాసుల వర్షం కురిసింది. చరిత్రలోనే రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్‌శాఖ వర్గాలు వెల్లడించాయి. ఒక్క మంగళవారం రోజునే సుమారు రూ.403 కోట్ల మద్యం విక్రయాలు జరిగనట్లు తెలిపారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 1 ఉదయం వరకు కేవలం 5 రోజుల్లోనే దాదాపు రూ.1,800 కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు మంచినీళ్లలా తాగేసినట్లు ఎక్సైజ్‌శాఖ వర్గాలు తెలిపాయి. గతంతో పోల్చితే ఈసారి మద్యం అమ్మకాలు భారీగా పెరిగినట్లు మద్యం షాపుల యాజమన్యాలు సైతం చెబుతున్నాయి. సాధారణ ధారణ రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. వీకెండ్స్‌లో ఈ లెకక్ రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ ఉంటుంది. డిసెంబర్ నెల చివరి వారంలో మాత్రం మద్యం అమ్మకాలు డబుల్ అయ్యాయి. 2024 డిసెంబర్ 31న ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా రూ.402 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా 2,620 మద్యం షాపులు, 1,117 బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్ ఉండగా ఆయా దుకాణాలకు 19 డిపోల నుంచి బేవరెజ్ సంస్థ మద్యం సరఫరా చేస్తోంది. కాగా, డిసెంబర్ నెలలో మద్యం ద్వారా సర్కారుకు కాసుల వర్షం కురవగా.. రికార్డు స్థాయిలో లిక్కర్ సేల్స్ జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఈ ఒక్క నెలలోనే 3,82,265 కేసుల లిక్కర్, 3,96,114 కేసుల బీర్ల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు. 2022 డిసెంబర్‌లో రూ.3,100 కోట్ల లిక్కర్ సేల్స్ జరగ్గా 2023లో 4,292 కోట్ల విక్రయాలు జరిగాయి. 2024 డిసెంబర్ 30 వరకు రూ.3,662 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని అధికారులు తెలిపారు. డిసెంబర్ 31ని కలుపుకుంటే దాదాపు 4 వేల కోట్ల మద్య విక్రయాలు జరిగాయి. కాగా, గతేడాది కంటే కాస్త తక్కువగా మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# రైతులకు గుడ్ న్యూస్

**- ఎరువులు, బీమా స్కీమ్‌లో భారీ మార్పులు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కొత్త సంవత్సరం తొలి రోజే కేంద్రం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. తొలి కేబినెట్ సమావేశంలో రైతులకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఇందులో డీఏపీ ఎరువులు తయారు చేసే కంపెనీలకు ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీని ఆమోదించింది. దీంతో రైతులు డీఏపీకి అధిక ధర చెల్లించాల్సిన అవసరం లేదు. ఎరువులపై అధిక సబ్సిడీ ఇవ్వనుంది కేంద్రం. డీఏపీ ఎరువుల తయారీదారులకు ఉపశమనం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం

2లో..

# హైదరాబాద్ మెట్రో మరింత విస్తరణ

**- డీపీఆర్‌కు రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు ఉండే ప్రజలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నిత్యం ట్రాఫిక్‌తో సతమతమయ్యే కష్టాలు తీర్చేందుకు సిద్ధమైంది. మెట్రో విస్తరణలో భాగంగా నార్త్ సిటీ వైపు కూడా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా డీపీఆర్ సిద్ధం చేయాలని మెట్రో ఎండీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వెంటనే డీపీఆర్?లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్-2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించవలసిందిగా హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. జనవరి 1, 2024న పురపాలక శాఖ ముఖ్య

2లో..

# 1995 నాటి ముఖ్యమంత్రిని మళ్లీ చూస్తారు

- మంగళగిరిలో టీడీపీ కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్
- తన మనోభావాలను పంచుకున్న సీఎం చంద్రబాబు
- ఇక ముందు పాత చంద్రబాబును చూస్తారని స్పష్టీకరణ
- 2004లో తనను ఎవరూ ఓడించలేదని వెల్లడి
- చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమైనట్టు వివరణ

2లో..



# సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్దాం

**- సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లాలని, ప్రజా సంబంధాలను మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తనను కలిసిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజా ప్రతినిధులతోపాటు అధికారులు, పార్టీ నాయకులు పలువురు సీఎంను కలిశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవి, ఇతర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు తన వద్దకు ప్రజాప్రతినిధులతో సీఎం మాటామంతీ కలిపినట్లు తెలుస్తోంది. తాజా రాజకీయ పరిణామాలతోపాటు ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎవరెవరు ఏమి చేస్తున్నారో తమ వద్ద పూర్తి సమాచారం ఉందని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్దామని సూచించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రోజు తాను కూడా ప్రజా ప్రతినిధులతో మాట్లాడతానని చెప్పినట్లు తెలుస్తోంది. నేటి నుంచే ఆ కార్యక్రమం మొదలు పెట్టినట్లు వెల్లడించారు. ఉదయం పలువురు మంత్రులతో తాను మాట్లాడానని, అదేవిధంగా ప్రతి రోజు కొందరితో మాట్లాడతానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ప్రజాప్రతినిధులు దగ్గర కావాలని స్పష్టం చేశారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో న్యూ ఇయర్ మార్పులు.?

**- ఇంచార్జ్‌గా దీపాదాస్ స్థానంలో సీనియర్ నేత?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ గెలిచినప్పటి నుంచి ఆ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ గా ఉన్న దీపాదాస్ మున్షీని తొలగించే అవకాశాలు ఉన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో ఇంచార్జ్‌గా మహారాష్ట్రకు చెందిన మాణిక్ రావు థాక్రే ఉన్నారు. అయితే ఎన్నికల తర్వాత ఆయననుతప్పించారు. బెంగాల్ కు చెందిన దీపాదాస్ మున్షీని నియమించారు. సాధారణంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్

2లో..

# కూటమిలో చేరికల చిచ్చు

**- పవన్ నిర్ణయం వెనుక వ్యూహం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి చేరికల సంఖ్య పెరుగుతోంది. తొలుత టీడీపీలోకి వైసీపీ నేతలు చేరేందుకు మొగ్గు చూపారు. అయితే, తమ సొంత నియోజకవర్గంలో పరిస్థితులకు అనుగుణంగా మూడు పార్టీల్లో ఎందులో చేరాలనేది నేతలు నిర్ణయించుకుంటున్నారు. తాజాగా బీజేపీ, జనసేనలో చేరికలు టీడీపీ నేతలకు రుచించటం లేదు. తమను ఇబ్బంది పెట్టిన వారిని కూటమిలో ఎలా చేర్చుకుంటారని టీడీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నా రు. అయితే, పవన్ మాత్రం పక్కా వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టం అవుతోంది.

**- కూటమిలో వార్**

వైసీపీ పరాజయంతో ఆ పార్టీ ముఖ్య నేతలు వరుసగా కూటమి పార్టీల్లో చేరుతున్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు టీడీపీలో చేరారు. అదే విధంగా బాలినేని, సామినేని వంటి వారు జనసేనలో చేరారు. బాలినేని జనసేన లో చేరిక పైన ఒంగోలు టీడీపీ నేతలు ఇప్పటికీ రాజీ పడటం లేదు. స్థానికంగా టీడీపీ నేతలు ఎవరూ బాలినేనితో కలిసి పని చేసేందుకు సిద్దంగా లేరు.

2లో..

# నాపై పెట్టింది లొట్టపీసు కేసు

- అవినీతే లేనప్పుడు కేసు ఎక్కడిదన్న కేటీఆర్
- ఏదో ఒక రకంగా తనను జైలుకు పంపాలని చూస్తున్నారని మండిపాటు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపిస్తామని ధీమా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కొత్త సంవత్సరం రోజున తెలంగాణ ప్రభుత్వంపై ఈ ఫార్ములా రేస్ కేసుపై మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాగైనా తనను అరెస్టు చేయాలని రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే ఆరో ప్రయత్నంగా

2లో..

# అక్కడ నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉంది

**- కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ వివరణ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. మంగళవారం ఉదయం ఖాజాగూడ భగీరథమ్మ చెరువు వద్ద హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇక్కడి ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై వివరణ ఇచ్చారు. తాము నిబంధనలు పాటిస్తూనే అక్రమ నిర్మాణాలను కూల్చివేశామన్నారు. నీటి వనరుల్లోని నిర్మాణాలను ఎలాంటి

2లో..

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం

**- డీజీపీ, హైదరాబాద్ సీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హీరో అల్లు అర్జున్ నిందితుడిగా ఉన్న సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన జాతీయ మానవ హక్కుల కమిషన్ వద్దకు చేరింది. తొక్కిసలాట ఘటనపై రామారావు అనే న్యాయవాది జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పుష్ప 2 సినిమా ప్రీమియర్ షోకు హీరో అల్లు అర్జున్ రావటం, పోలీసులు లాఠీఛార్జి చేయడంతోనే ఈ ఘటన జరిగిందని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు చేసిన ఫిర్యాదులో న్యాయవాది రామారావు ఆరోపించారు. ఈ ఘటనలో రేవతి అనే మహిళ చనిపోయిందని ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. న్యాయవాది ఫిర్యాదుపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట

2లో..

# 1995 నాటి ముఖ్యమంత్రిని మళ్లీ చూస్తారు

అమరావతి (ప్రశ్న న్యూస్) మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలో సీఎంగా ఎలా పరిపాలించానో అందరికీ తెలుసని, మరోసారి 1995 నాటి సీఎంను చూస్తారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. "1995లో సీఎంగా నా పనితీరు చూశారు. ఇక ముందుకు కూడా ఆనాటి సీఎంను చూస్తారు. సోషల్ మీడియాలో ఇదివరకు లాగా ఇష్టమొచ్చినట్టు అసభ్యకరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయి. సెకీ ఒప్పందం మాకు లడ్డూలా దొరికిన విషయం వాస్తవమే. అయినప్పటికీ చట్టం ప్రకారమే ముందుకు వెళతాం. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

2004లో నన్ను ఎవరూ ఓడించలేదు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా. నేను చేసిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయాం. ఈసారి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజలను నాతోపాటే తీసుకెళతాను. ఆరు నెలల్లో వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఇన్ని వేల కోట్లు పెట్టుబడులు రాలేదు. ఇచ్చిన హామీలైన సీపీఎస్ రద్దు, మద్య నిషేధం అమలు చేస్తామని అబద్ధాలు చెప్పాడు. అధికారంలోకి వచ్చాక 'నాకు తెలియదు, ఇంత ఖర్చు అవుతుందని అనుకోలేదు' అంటూ మాట మార్చారు. ఎంతమంది ఉన్నా అమ్మఒడి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. మేము మాత్రం ఇచ్చిన సూపర్ 6 హామీలను కచ్చితంగా అమలు చేస్తాం.

**- మేం వచ్చాక ప్రజల్లో భరోసా కలిగింది**

జగన్ రెడ్డి ఐదేళ్ల ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎంతో భరోసా కలిగింది. జగన్ అరాచక విధానాలతో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు. అమరావతి, పోలవరం, ఇతర సాగునీటి ప్రాజెక్టులను సమస్యల వలయంలో నెట్టివెళ్లాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు సార్లకుపైగా ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి నిధులు తేవడంతో పాటు సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించుకున్నాం. ఉన్మాదంతో సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిని కట్టడి చేస్తున్నాం. సమస్యల సుడిగుండంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించేందుకు ఒక్కో చిక్కుముడిని విప్పుకుంటూ ముందుకు వెళుతున్నాం. జగన్ రెడ్డి ప్రభుత్వ తప్పిదాలు రాష్ట్ర ప్రజలకు శాపాలుగా మారాయి. వాటిని సరిచేసేందుకు ఈ ఆరు నెలల పాటు కసరత్తు చేశాం. గత ఐదేళ్ల పాలన నేరాలు ఘోరాలకు అడ్రస్‌గా మారింది. కూటమి ప్రభుత్వం రాగానే శాంతి భద్రతలను సక్రమంగా అమలు చేస్తూ నేరాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాం,

**- గత పాలనంతా విధ్వంసం, మేము రిపేర్లు చేస్తూ వెళుతున్నాం**

మా ప్రభుత్వానికి కొన్ని ప్రాధాన్యతలు ఉన్నాయి. అందుకు అనుగుణంగానే మేం పాలన సాగిస్తున్నాం. ధ్వంసమైన వ్యవస్థలను రిపేర్ చేసుకుంటూ వేళ్తూ ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నాం. పోలవరం ప్రాజెక్ట్, అమరావతి నిర్మాణానికి జగన్ అనేక చిక్కుముడులు వేశాడు. వాటిని విడదీస్తూ అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నాం. పోలవరం ప్రాజెక్టుకు టెక్నికల్ కమిటీ ఫిజుబిలిటీ రిపోర్ట్ ఇచ్చింది. కేంద్రం నుంచి నిధులు రాబట్టి త్వరలో పోలవరం ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి అనుకున్న సమయానికే పూర్తి చేస్తాం. నేను ఎప్పుడూ రాజకీయ కక్షలు తీర్చుకోను తప్పు చేసిన వారిని మాత్రం వదిలేది ప్రసక్తి లేదు. ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో న్యూ ఇయర్ మార్పులు.?

కాబట్టి ఆమె పార్టీ వ్యవహారాలకే పరిమితం కావాలి. కానీ పాలనలో జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఆ పార్టీ నేతల నుంచే వస్తున్నాయి. అదే సమయంలో మంత్రి వర్గ విస్తరణ జరగకపోవడానికి కూడా ఆమె అడ్డం పడటమే కారణమన్న అసంతృప్తి కొంత మంది నేతల్లో ఉంది. కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ అంటే.. హైకమాండ్‌కు నివేదికలు పంపడం కీలకం. వారు పంపే నివేదికల్ని హైకమాండ్ పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ క్రమంలో ఆమె పార్టీ పరిస్థితులపై నివేదికలు ఇస్తూ మంత్రి వర్గ విస్తరణ జరగకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తో పాటు కొన్ని ప్రభుత్వ పనులకు సంబంధించిన వ్యవహారాల్లో ఆమె కీలకంగా ఉంటున్నారని చెబుతున్నారు. మహేష్ కుమార్ గౌడ్ ఇంటి వద్ద లేదా గాంధీభవన్ వద్ద కన్నా దీపాదాస్ మున్షి ఇంటి వద్దే ఎక్కువ సందడి ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పార్టీ నేతలు వచ్చి కలుస్తూనే ఉంటారు. ఎవరెవరు కలవాలనేది దీపాదాస్ మున్షి వ్యక్తిగత టీం నిర్ణయిస్తుందని పార్టీ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. సాధారణంగా ఇంచార్జ్ ఎవరైనా అవసరం అయినప్పుడు మాత్రమే వస్తారు. కానీ మున్షి హైదరాబాద్‌లో ఓ బంగ్లా అద్దెకు తీసుకుని మరీ పార్టీ వ్యవహారాలను చక్కబెట్టడం లేదని పాలనలో జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీపాదాస్ మున్షి రాష్ట్రంలోకి వచ్చిన కొత్తలో అత్యంత లగ్జరీ కారును గిఫ్టుగా పొందారని బీజేపీ నేతలు ఆరోపించారు. అయితే వారిపై ఆమె కోర్టులో కేసు వేశారు. ఇంచార్జ్‌కు అసలు తెలంగాణలో ఏం పని అని వస్తున్న విమర్శలను కూడా ఆమె లెక్క చేయడం లేదు. దీపాదాస్ మున్షి పై కాంగ్రెస్‌లోనే అంతర్గతంగా అసంతృప్తి కనిపిస్తూండటంతో హైకమాండ్‌కు ఫిర్యాదులు పంపుతున్నారని ప్రచారం జరుగుతోంది. పార్టీ హైకమాండ్ కు కూడా ఇలాంటి ఫీడ్ బ్యాక్ వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు.

# అక్కడ నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉంది

నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేసే హక్కు ఉందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ కూడా ఇదే అంశంపై తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చిందన్నారు. చట్టాలను పాటిస్తూనే కోర్టులను గౌరవిస్తూనే తాము ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలనే తొలగించామని రంగనాథ్ వెల్లడించారు. నోటీసులు ఇవ్వకుండానే కూల్చవచ్చని కానీ మానవతా దృక్పథంతో ఇరవై నాలుగు గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. నోటీసులు ఇచ్చాక కూడా 24 గంటల్లో ఖాళీ చేయనందునే కూల్చివేశామన్నారు. ఖాజాగూడలోని బ్రాహ్మణకుంట ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం నాడు ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు ఇచ్చి ఇరవై నాలుగు గంటలు కూడా గడవకముందే ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించింది. ఇలాగే చేస్తే హైడ్రా కమిషనర్‌ను కోర్టుకు పిలవాల్సి ఉంటుందని హెచ్చరించింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు

# నాపై పెట్టింది లొట్టపీసు కేసు

పస లేని ఈ ఫార్ములా రేసు కేసు తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. పైసా అవినీతి జరగని చోట కేసును ఎలా పెట్టారని కేటీఆర్ ప్రశ్నించారు. ఏసీబీ పెట్టిన ఎఫ్ఐఆర్ తప్పు అని కొట్టిపారేశారు. ఈ కేసు విషయంలో కోర్టులో జరుగుతన్న వాదన సందర్భంగా న్యాయమూర్తి అడిన ప్రశ్నలకు ఏజీ సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. అందుకే ఇదో లొట్టపీసు కేసుగా అభివర్ణించారు. ఈ కేసులో తనను అరెస్టు చేసినట్టైతే సీఎం రేవంత్ రెడ్డిని కూడా అరెస్టు చేయాలన్నారు కేటీఆర్. ఈడీ విచారణకు ఈనెల 7న వెళ్లడంపై తన న్యాయనిపుణుల బృందం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు కేటీఆర్.

న్యాయస్థానాలపై తనకు పూర్తిగా నమ్మకం ఉందని కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. మరోవైపు కొత్తగా టెండర్లు పిలవబోతున్న ట్రిపుల్ ఆర్ విషయంలో చాలా అవినీతి జరగబోతోందని ఆరోపించారు కేటీఆర్. దాదాపు పన్నెండు వేల కోట్ల రూపాయల ఫ్రాడ్ జరగబోతోందని అన్నారు. తెలంగాణలో పెద్ద పెద్ద కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి మూటలు పంపిస్తున్నారని కామెంట్స్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వెనక్కి తగ్గేదే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుపై సంక్రాంతి తర్వాత సుప్రీంకోర్టులో పిటిషన్ వేయబోతున్నట్టు వెల్లడించారు. కచ్చితంగా వారిపై వేటు పడుతుందన్న కేటీఆర్ ఈ ఏడాదిలోనే ఉప ఎన్నికలు కూడా ఉంటాయని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో ఆయన బాగా తెలుసని ప్రజలకు అవసరమైనప్పుడు కచ్చితంగా బయటకు వస్తారని వివరించారు.

# కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు కై నేడు సమన్వయ సమావేశం

**- జిల్లా సహకార అధికారి సి.హెచ్. మనోజ్ కుమార్**

**జగిత్యాల :** జిల్లాలో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు పై శుక్రవారం జనవరి 2 న సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా సహకార అధికారి సి. హెచ్. మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న సమావేశంలో జిల్లా లో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు అంశాన్ని చర్చిస్తారని, సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సహకారవేత్తలు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా సహకార అధికారి ఆ ప్రకటన లో కోరారు.

# కూటమిలో చేరికల చిచ్చు

అదే విధంగా ఏలూరులో ఆళ్ల నాని టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ, స్థానికంగా వచ్చిన అభ్యంతరాలు చర్చగా మారాయి. కూటమిలో ఏ పార్టీకి అభ్యంతరం లేకపోతేనే చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని గతంలో జరిగిన సమన్వయ కమిటీ భేటీలో నిర్ణయించారు.

**- చేరికల చిచ్చు**

బీజేపీలో వైసీపీ నేత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌ను బీజేపీలో చేర్చుకున్న వ్యవహారం కూటమి పార్టీల మధ్య చిచ్చు కు కారణమైంది. స్పీకర్ అయ్యన్న నేరుగా చంద్రబాబుకు ఫిర్యాదు చేసారు. అదే విధంగా తాజాగా టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన నేతలు ఇప్పుడు జనసేనలో చేరారు. గంజి చిరంజీవి ని పవన్ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. తొలుత టీడీపీలో ఉన్న చిరంజీవి ఆ తరువాత వైసీపీలో చేరి లోకేష్‌పై ఇష్టానుసారంగా మాట్లాడారు. లోకేశ్‌పై పోటీకి సిద్ధమైన గంజి చిరంజీవిని జనసేనలో చేర్చుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, స్థానికంగా జనసేన ముఖ్య నేతల సిఫార్సుతో పవన్ పార్టీలో చేర్చుకున్నారు.

**- పవన్ తాజా వ్యూహాలు**

అదే విధంగా కైకలూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తాజాగా జనసేనలో చేరారు. ఈ పరిణామం కైకలూరు టీడీపీ శ్రేణులకు మింగుడుపడటం లేదు. కానీ, వచ్చే ఎన్నికల నాటికి పవన్ తన పార్టీకి బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఆ దిశగా పార్టీలో చేరికల పైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కూటమిగానే ఉంటూ మూడు పార్టీలు తమ బలం పెంచుకు నే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే, వీటిని ప్రశ్నించే పరిస్థితులు కనిపించటం లేదు. కానీ, ఈ చేరికలతో ప్రధానంగా ఆ నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు మాత్రం ఆగ్రహంతో కనిపిస్తున్నారు. ఇక, ఇప్పుడు చంద్రబాబు ఈ చేరికల పైన ఏం చేస్తారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం

ఘటనపై సీనియర్ ర్యాంక్ పోలీసు అధికారితో విచారణ జరిపించి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో బెనిఫిట్ షో ఏర్పాటు చేశారు. ఈ ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ కూడా హాజరయ్యారు. అయితే అల్లు అర్జున్‌ను చూడ్డానికి అభిమానులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో రావటంతో సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ చనిపోయారు. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అల్లు అర్జున్‌ను ఏ11గా పేర్కొన్నారు. అనంతరం అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు.అల్లు అర్జున్ అరెస్ట్ తర్వాత నాంపల్లి కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్ గూడ జైలుకు అల్లు అర్జున్‌ను తీసుకెళ్లారు. అయితే అల్లు అర్జున్ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు అల్లు అర్జున్‌ను మధ్యంతర బెయిల్ ఇచ్చింది. దీంతో మరుసటి రోజు అల్లు అర్జున్ చంచల్ గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత అల్లు అర్జున్ అంశం గురించి సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం అదే రోజు రాత్రి అల్లు అర్జున్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయడంతో ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారిపోయింది.

అల్లు అర్జున్ ప్రెస్ మీట్ తర్వాత హైదరాబాద్ పోలీసులు విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి సంధ్య థియేటర్ తొక్కిసలాట వీడియోలు విడుదల చేయటంతో మరింత చర్చనీయాంశమైంది. తాజాగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ విషయంలో తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సీపీకి నోటీసులు జారీ చేసింది.

# హైదరాబాద్ మెట్రో మరింత విస్తరణ

కార్యదర్శి దానకిషోర్, హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్లకు డీపీఆర్ తయారీ విషయంలో చర్చించి సీఎం ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్–మేడ్చల్‌తోపాటు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్‌కు సంబంధించిన విస్తరణ విషయంపై కూడా రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్ల దూరం ఉంటుంది. జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రెండు మార్గాల్లో డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం మెట్రో విస్తరణకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసింది. ఫేజ్ –2 పేరుతో దీన్ని సిద్ధం చేసింది. అందులో దీన్ని కూడా ఇన్‌క్లూడ్ చేయాలని సూచించింది.గతంలో మల్కాజ్ గిరి ఎంపీగా పనిచేసిన తనకు ఆ ప్రాంత ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్?ల రూట్ మ్యాప్?లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూట్ మ్యాప్ గురించి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్?కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలను కూడా తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రి మెట్రో ఎండీని ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మీడియాకు చెప్పారు. మెట్రో ఫేజ్–2 'ఏ' భాగం లాగే 'బి' భాగాన్ని కూడా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్?ల రూపకల్పన మొదలుపెట్టినట్టు తెలిపారు. దాదాపు 5 లక్షల మంది ప్రతిరోజూ మెట్రోలో ప్రయాణిస్తున్నట్లు అంచనా. ప్రస్తుతం మూడు కాడిడార్లు ఎల్బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గం, జేబీఎస్–ఎంజీబీఎస్ కారిడార్లలో మెట్రో సేవలందిస్తోంది. మరింత విస్తరించేందుకు రెండో దశను ప్రాతిపాదించారు. కారిడార్ %×ఎ%లో భాగంగా నాగోల్ – ఆర్జీఐఏ ఎయిర్ పోర్ట్ వరకు, కారిడార్ %ఎ%లో రాయదుర్గం –కోకాపేట్ నియోపోలిస్ వరకు, కారిడార్ %ఎ×%లో ఎంజీబీఎస్ %–% చంద్రాయన్ గుట్ట వరకు, కారిడార్ %ఎ××%లో మియాపూర్ %–% పటాన్ చెరు వరకు, కారిడార్ %ఎ×××%లో ఎల్ బి నగర్ %–% హయత్ నగర్ వరకు, కారిడార్ %×శ% ఆర్జీఐఏ %–% ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) వరకు నిర్మించాలని ఇప్పటికీ డీపీఆర్ రెడీ చేశారు. దీన్ని మేడ్చల్ వరకూ విస్తరించబోతున్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

**- రిటైర్డ్ ఇంటర్మీడియెట్ ఆర్జేడీ ఎల్.సుహాసిని**

**జగిత్యాల :** :సమగ శిక్షా ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నానని, వారి సర్వీసులు క్రమ బద్ధీకరించబడి, వారికి న్యాయం జరిగే వరకు వారి వెంట ఉంటానని రిటైర్డ్ ఇంటర్మీడియెట్ ఆర్జేడీ ఎల్.సుహాసిని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో 23 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం రిటైర్డ్ ఆర్జేడీ సుహాసిని బ సందర్శించారు.వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ, సమగ్ర శిక్షా ఉద్యోగులు 23 రోజులు చేస్తున్న పోరాటం సత్యాగ్రహం లాంటిదన్నారు. 18 ఏండ్ల నుండి సమగ్ర శిక్షా విభాగంలో దాదాపు ఇరవై వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు.వారికి న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు, ప్రయోజనాలు రాకపోవడం బాధకరమన్నారు. నిరుపేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలు,కస్తూర్బా పాఠశాలల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. చాలీచాలనీ వేతనంతో, అనేక వ్యయ ప్రయాసలు ఓర్చుకుంటూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. ప్రసూతి సెలవుల వంటి కనీస సౌకర్యాలు లేకుండా మహిళా ఉపాధ్యాయులను పని చేయించుకోవడం అత్యంత బాధకరం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోను, తదుపరి తెలంగాణ రాష్ట్రంలోను సమగ్ర శిక్షా ఉద్యోగులకు సరైన న్యాయం జరగలేదన్నారు. 18 ఏండ్ల పాటు ప్రభుత్వం సేవలు తీసుకొని సమగ్ర శిక్షా ఉద్యోగుల సేవలను గాలికి వదిలిపెట్టడం సరికాదన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, వారు చెబుతున్న డిమాండ్లలో న్యాయం ఉందన్నారు. బేషరతుగా వారందరి సర్వీసులను క్రమబద్ధీకరించాల్సిందేనన్నారు. సర్వీసులు రెగ్యులరైజ్ చేసే వరకు పేస్కేల్ అమలు చేయాలని, జీవిత భీమా 20 లక్షలు, ఆరోగ్య భీమా 10 లక్షలు ఇవ్వమని కోరుతున్నారని, ఇవి అతి సాధారణ డిమాండ్లన్నారు. రైతులకు ఐదులక్షల బీమా ఇస్తున్న ప్రభుత్వం, టీచర్లకు, విద్యారంగ నిపుణులకు ఇరవై లక్షల బీమాను చెల్లించలేదా అని ఆమె ప్రశ్నించారు. ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు ఏడాదికి పది లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం కల్పిస్తున్నారని, ప్రభుత్వ అధీనంలో పనిచేసే పాఠశాలల్లో పనిచేసే వారికి ఆమాత్రం బీమా సౌకర్యం కల్పింపజేయలేరా అని ఆమె ప్రశ్నించారు.రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, సమగ్ర శిక్షా ఉద్యోగులు మద్దతును ఇవ్వాలని, వారి సమస్యల పరిష్కారం అయ్యే వరకు అసెంబ్లీ వేదికగా పోరాటం జరుపుతానన్నారు. కాగా..23వ రోజు సమగ్ర శిక్ష.. ఉద్యోగులు...కారం మెతుకులు తిని తమ నిరసన తెలిపారు... ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# గురుకుల విద్యాలయాల్లో మృత్యుఘోష..

**ఖమ్మం** తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో మరణమృదంగం మోగుతోంది. ఇప్పటికే పలువురు విద్యార్థులు పాముకాట్లు, కలుషిత ఆహారం వల్ల బలైతే.. తాజాగా మరో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని తనువు చాలించారు. ఒకరు కళాశాలలోనే ఉరి వేసుకోగా, మరోచోట ఎలుకల మందుతాగి ప్రాణాలు విడిచాడు. ఖమ్మం జిల్లాలో వేరువేరు గురుకులాల్లో ఈ దారుణ సంఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన మాదుగుల సాయివర్ధన్ (17) మధిర మండలం కృష్ణాపురం సోషల్ వెల్ఫేర్ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్లిన సాయివర్ధన్.. సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చాడు. తోటి విద్యార్థులతో రాత్రి 10 గంటల వరకు కలిసే ఉన్నాడు. అర్ధరాత్రి సమయంలో అందరూ నిద్రపోయిన తర్వాత హాస్టల్ పైఅంతస్తులోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారుజామున హాస్టల్ సిబ్బంది గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన కుక్కల భార్గవ్ (17) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ఎస్సీ గురుకుల కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిన భార్గవ్‌ను తిరిగి హాస్టల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన భార్గవ్ డిసెంబర్ 27న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు గమనించి వెంటనే దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. గురుకుల విద్యార్థుల వరుస మరణాలపై ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు మరణిస్తున్నారని ఆరోపించారు.

# బుర్కా ధరించకపోతే విడాకులు.. కుదరదన్న హై కోర్టు

భార్య బుర్కా ధరించపోయినంత మాత్రాన విడాకులు ఇవ్వడానికి కుదరదని అలహాబాద్ హై కోర్టు చెప్పింది. బహిరంగ ప్రదేశాల్లో భార్య ముఖం చూపిస్తూ తిరగడాన్ని ఓ భర్త మానసిక వేధింపులు గా పేర్కొంటూ తనకు విడాకులు మంజూరు చేయాలని హై కోర్టును ఆశ్రయించాడు. కానీ బుర్కా ధరించకపోవడం మానసిక వేధింపులకు సమానం కాదని హై కోర్టు అభిప్రాయపడింది. కానీ ఇతర కారణాలతో ఈ కేసులో విడాకులు మంజూరు చేసే అవకాశాలున్నాయని సూచనలు చేసింది.అలహాబాద్ హై కోర్టుకు చెందిన జస్టిస్ సౌమిత్ర దయాల్ సింగ్, జస్టిస్ దొనాది రమేష్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు ఒక భర్త తన భార్య నుంచి విడాకులుతో దాఖలు చేసిన పిటీషన్‌ను విచారణ చేసింది. తన భార్య తనను చాలా కాలం క్రితమే వెళ్లిపోయిందని.. మానసికంగా వేధించిందని సదరు భర్త పిటీషన్ లో పేర్కొన్నాడు.ఈ కేసుల భర్త తరపున లాయర్ వాదిస్తూ.. సదరు భార్య బుర్కా ధరించకుండా మార్కెట్ వెళుతుందని, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పరపురుషులతో తిరుగుతుందని.. ఇదంతా తన భర్తను మానసికంగా వేధించడానికే చేసిందని ఆరోపించారు. దీనిపై హై కోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పందిస్తూ.. "భార్యకు కూడా సొంత నిర్ణయాలు తీసుకునే అధికారులు ఉన్నాయి. ఆమె సమంజంలో బుర్కా ధరించకుండా తిరిగేందుకు ఆమెకు అన్ని హక్కులున్నాయి. అయితే ఆమె వివాహేతర సంబంధం, లేదా చట్టాలను, నైతిక విలువలను ఉల్లంఘించడం చేస్తేనే మానసికంగా వేధించినట్లు అవుతుంది. భార్యభర్తలిద్దరికీ సొంత అభిప్రాయాలుంటాయి. కానీ వాటిని ఎదుటి వ్యక్తిపై బలవంతంగా రుద్దితే అది మానసిక కృ?రత్వాన్ని చూపుతుంది. ఇవన్నీ ఇద్దరి మధ్య భేదాభిప్రాయాల వల్ల ప్రారంభమవుతాయి. వీటని మానసక వేధింపులుగా గుర్తించడం కష్టం '' అని తెలిపింది.అయితే ఈ కేసులో ఇంతకుముందు విచారణ చేపట్టిన ఫ్యామిలీ కోర్టు తీర్పును అలహాబాద్ హై కోర్టు సమర్థించింది. భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు భర్త ఆరోపణలు చేశారే తప్ప నిరూపించేలేదని చెప్పింది. ముస్లిం మతానికి చెందిన ఈ దంపతుల విడాకులు కేసులో భార్య ఒక పంజాబీ బాబాతో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త ఆరోపణలు చేశాడు. కానీ వాటిని నిరూపిస్తూ సరైన ఆధారాలు కోర్టు ముందు ప్రవేశ పెట్టలేదు.అయితే హై కోర్టు సదరు భర్తకు కొన్ని సూచనలు చేసింది. ఈ కేసులో భార్య చాలా కాలంగా భర్త నుంచి విడిపోయి వేరుగా జీవిస్తోంది. ఆమెను భర్త కాపురం కోసం పిలిచినా రాలేదు కనుక ఈ కారణాల చేత విడాకులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పైగా భార్య ఒక ప్రభుత్వ టీచర్ ఉద్యోగం చేస్తోంది. భర్త ఒక ఇంజినీర్. దీంతో ఈ కేసులో భరణం లాంటి కోణం కూడా లేదని.. ఇద్దరికీ పుట్టిన సంతానం.. ఒక కొడుకు ఇప్పుడు 29 ఏళ్ల యువకుడు కాబట్టి.. అతని కస్టడీ సమస్యలు కూడా లేవని అభిప్రాయపడింది.

# రైతులకు గుడ్ న్యూస్

ప్రకటించింది. వారికి సబ్సిడీతోపాటు ఆర్థిక సాయం అందించేందుకు కూడా ఆమోదం తెలిపింది. వ్యవసాయ ఉత్పాదకతను ప్రోత్సహించడం, రైతులకు ఆర్థిక సహాయం అందించడంతోపాటు అవసరమైన ఎరువులను సరసమైన ధరలకు అందించడం ఈ నిర్ణయాల లక్ష్యం. అందుకే జనవరి 1నే కేంద్రం ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. దంతో ఇప్పుడు రైతులకు 50 కిలోల డిఏపి బ్యాగ్‌ను రూ.1350కి రానుంది. దీనికి అయ్యే అదనపు ఖర్చులను కేంద్రం భరించనుంది. దీని కోసం డీఏపీ కంపెనీలకు రూ.3850 కోట్ల సబ్సిడీని భారత ప్రభుత్వం ఇస్తుంది.డీఏపీ ప్యాకేజీ ఒక సంవత్సరంపాటు వర్తిస్తుంది అంటే దీని ప్రయోజనాన్ని 31 డిసెంబర్ 2025 వరకు పొందవచ్చు. డీఏపీ ఎరువుల తయారీదారులకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం ఈ ప్యాకేజీని ఆమోదించింది. కేంద్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు రూ.69515 కోట్లకు పెంచుతూ ఆమోదం తెలిపినట్లు తెలిపారు. దీని వల్ల 4 కోట్ల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. చిన్న రైతులు ఫసల్ బీమా యోజన ప్రయోజనం పొందుతున్నారు. ఈ ఫసల్ బీమా పథకాన్ని మరో స్థాయికి తీసుకువెళ్తామన్నారు. రైతుకు ఇస్తున్న పంటల బీమా పథకాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పంటల బీమా పథకాన్ని సులభతరం చేసేందుకు, దాని నియమాలు, నిబంధనలను సవరిస్తామన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించిన మొదటి కేంద్ర మంత్రివర్గ సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగింది, ఇందులో ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు.

### డీఏపీ అంటే ఏమిటి

డీఏపీ అంటే డి–అమ్మోనియం ఫాస్ఫేట్, ఇది పంటలకు భాస్వరం, నత్రజని అందిస్తుంది. డీఏపీ అనేది అమ్మోనియా, ఫాస్పోరిక్ ఆమ్లం ప్రతిచర్య నుండి తయారైన నీటిలో కరిగే ఎరువులు. రైతులకు ఇది ఒక ప్రధానమైన ఎంపిక ఎందుకంటే ఇది వేగంగా కరిగిపోతుంది. పోషకాలలో అధికంగా ఉంటుంది.

### మోదీ హర్షం

కేబినెట్ తీసుకున్న నిర్ణయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. అందుకే మొదటి మంత్రిమండలి భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు.

# నూతన సంవత్సరం ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు నింపాలి

**- నూతన సంవత్సర వేడుకలలో మాజీ మంత్రి**



**వనపర్తి** నూతన సంవత్సర (2025) వేడుకలు బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ ఆధ్వర్యములో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగించాలని రాబోవు కాలంలో పార్టీ శ్రేణులందరికి మంచి జరగాలని కోరుకుంటూ కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. పలువురు నాయకులు నిరంజన్ రెడ్డి కి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మయ్య,వాకిటి.శ్రీధర్, నందిమల్ల.అశోక్,మాణిక్యం,బండారు.కృష్ణ,గంధం.పరంజ్యోతి,నాగన్న యాదవ్,ప్రేమ్ నాథ్ రెడ్డి, జత్రు నాయక్, నీల స్వామి, మాధవ్ రెడ్డి, నరేష్, ద్యా నియల్,సూర్యవంశపు.గిరి,విశ్వనాథం, పి. జోహెబ్ హుస్సేన్,చిట్యాల.రాము, సురేష్ జె.శ్రీను, ముద్దు సార్, వజ్రాల.రమేష్,తోట.శ్రీను,,శివ,లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ రద్దు దిశగా అడుగులు

## - అప్పుల కోసం,,, కార్పొరేషన్లు... - 5 కార్పొరేషన్లు...95 వేల కోట్లు

అప్పు చేయడం తప్పు కాదు.. అవసరం ఉన్నప్పుడు చేయాల్సిందే. అవసరాలు తీర్చుకోవాల్సిందే. అంతే బాధ్యతగా తిరిగి చెల్లించాల్సిందే. ఇదే చాణక్యనీతి చెబుతున్న మాట. కానీ తాహతుకు మించి చేసే అప్పులు పెను నష్టాన్ని కలిగిస్తాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఇదే చేసింది. దొరికిన చోటల్లా అప్పులు చేసింది. అభివృద్ధి చేయడానికే అప్పులు చేశామన్న మాట ఆనాడు వినిపించారు. కానీ మార్కెట్లో ఉన్న వడ్డీల కంటే అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడం ఒక తప్పు.అప్పుల కోసమే కార్పొరేషన్లు సృష్టించి ఎడా పెడా బాకీలు తెచ్చింది గత కేసీఆర్ సర్కార్. ఇప్పుడు అవి గుదిబండగా మారాయి. అప్పుల కుప్పగా అయ్యాయి. అందుకే వాటిలో ఏవి ఉండాలో ఏవి ఊడాలో డిసైడ్ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే చేస్తోంది. అప్పుల కుప్పగా మారిన కార్పొరేషన్ల లిస్టు రెడీ చేసింది. ఏవి సొంతంగా రెవెన్యూ జెనరేట్ చేసుకుని లాభాల్లో ఉన్నాయి.. ఏవి నిండా మునిగాయో లిస్టు రెడీ చేసింది. ఆ ప్రకారంగా వాటిని మూసేసేందుకు సిద్ధమవుతోంది. నిజానికి ప్రభుత్వ ఖజానాను ఫుట్ బాల్ మాదిరి ఆడుకోవడం కరెక్ట్ కాదు.రాష్ట్రంలో చాలా కార్పొరేషన్ల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది. సో వాటికి చెక్ పెట్టేలా లిస్ట్ రెడీ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ నిధులు వృధా అవుతూ ఎలాంటి ఉపయోగం లేని వాటికి గుడ్ బై చెప్పబోతోంది. అందులోని ఉద్యోగులను ఇతర సంస్థల్లో విలీనం చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. అటు ఎస్సీఎస్టీబీసీ కార్పొరేషన్లను మరింత బలోపేతం చేయడం, రెవెన్యూ ఎక్కువ జెనరేట్ చేస్తున్న వాటికి మరింతగా బూస్టప్ ఇచ్చేలా రేవంత్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.తెలంగాణలో ప్రస్తుతం 90కి పైగా కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో ఐదారు తప్ప మిగతా కార్పొరేషన్లకు ఎలాంటి ఇన్ కమ్ లేదు. కేవలం నామ్ కే వాస్తేగా నడుస్తున్నాయి. ఇందులోనూ ఎక్కువ కార్పొరేషన్లు రాజకీయ నిరుద్యోగుల పదవుల భర్తీ కోసం, ప్రభుత్వానికి అప్పులు తెచ్చి పెట్టేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి. సో ఓవరాల్ గా చూస్తే కార్పొరేషన్ల ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పులు 2 లక్షల 82వేల 84 కోట్లుగా ఉంది. ఇది మొత్తం తెలంగాణ రాష్ట్ర అప్పులో 42 శాతంగా ఉందంటే ఏ స్థాయి కుప్ప జమైందో అర్థం చేసుకోవచ్చు.ఇందులో ప్రభుత్వం హామీ ఇచ్చి, తీర్చాల్సిన అప్పులు ఒక లక్షా 27 వేల 208 కోట్లుగా ఉంది. అలాగే గత ప్రభుత్వ షూరిటీలతో అప్పులు తీసుకుని, వాటిని తీర్చే బాధ్యత కార్పొరేషన్ల మీద ఉన్నవి 95 వేల 462 కోట్ల రూపాయలు. అంతే కాదు ఇవన్నీ చాలవన్నట్లుగా కార్పొరేషన్లు సొంతంగా బాకీలు చేసి, తామే తీర్చే అప్పులు 59వేల 414 కోట్లుగా ఉంది. అయితే ఈ కార్పొరేషన్లకు ఇన్ కమ్ లేక వీటి అప్పులను కూడా సర్కారీ ఖజానా నుంచే చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది.ఉన్న కార్పొరేషన్లలో 90 శాతం కార్పొరేషన్లు అప్పుల ఊబిలోనే ఉన్నాయి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా అప్పుల విషయంలో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రస్తుత ప్రభుత్వానికి తలకుమించిన భారంగా మారింది. అందుకే వాటిని సెట్ రైట్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ రెడీ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇది ప్రజల భారాన్ని తగ్గించడం కోసమే. ప్రజల సంక్షేమం బాగుండాలంటే ముందుకు అధిక మిత్తీలకు తెచ్చిన అప్పుల్ని క్లియర్ చేసేయాల్సిన పరిస్థితి ఉంది.ప్రజా ధనాన్ని పకడ్బందీగా వాడాలి. ఎక్కడా రూపాయి వేస్ట్ కావొద్దన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. వాటిని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలన్న కాన్సెప్ట్ తో రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే గుదిబండగా ఉన్న లోన్ల రీస్ట్రక్చరింగ్ పై నజర్ పెట్టింది. అధిక వడ్డీలకు తెచ్చిన లోన్లపై టాప్ అప్ ల జోలికి వెళ్లడం లేదు. ఇంటి కోసం హోమ్ లోన్ తీసుకునే వారిలో కొందరు టైమ్ కంటే ముందుగానే తమ చేతికి డబ్బు అందినప్పుడల్లా ప్రిన్సిపుల్ అమౌంట్ కడుతుంటారు. లోన్ త్వరగా క్లియర్ చేసుకునే పనిలో ఉంటారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా అదే పని చేస్తోంది.తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ, టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్, బేవరేజెస్ కార్పొరేషన్, జెన్కో, ట్రాన్స్కో, సివిల్ సప్లయ్స్, ఫారెస్ట్ డెవలప్ మెంట్, మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్లు, సింగరేణి వంటివి తమంతట తాము సెట్ చేసుకునే పరిస్థితిలో ఉన్నాయి. అంటే వాటికి వివిధ మార్గాల ద్వారా వచ్చే నిధులను జీతాలు, నిర్వహణ ఖర్చుల కోసం వాడుకుంటున్నాయి. ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితిలో లేవు.నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి చూపాల్సిన సెట్విన్ అనే కార్పొరేషన్ పూర్తిగా ఉనికి కోల్పోయింది. ఫిల్మ్ అండ్ టెలివిజన్, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ తో పాటు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసి రైతులకు అందించే ఆగ్రోస్ వంటివి నిధుల్లేక ఖాళీగా చేతులెత్తేసి రెడీగా ఉన్నాయి. ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, హాకా వంటి సంస్థలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోంది. వీటితో పాటే స్టేట్ హ్యాండి క్రాఫ్ట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్, విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, మేదర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్,ట్యాడీ టాపర్స్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్..మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, వుమెన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, వికలాంగుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ యోగాధ్యయన పరిషత్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, లెదర్ ఇండస్ట్రీస్ డెవల్పమెంట్ కార్పొరేషన్, ఆగ్రోస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, వేర్హౌసింగ్ కార్పొరేషన్, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, టెక్స్టైల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, లైవ్స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవల్పమెంట్ కార్పొరేషన్, సెట్విన్, ట్రైకార్, తెలంగాణ ఫుడ్స్ వంటివి ఉన్నాయి. ఇలాంటి సంస్థలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని అనుకుంటోంది. ఏం చేస్తే ఇవి ఉపయోగపడుతాయి? ఎలా చేయాలన్నది ఫైనల్ కాల్ తీసుకోబోతున్నారుఅసలు ఆదాయమే లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నుంచి ఎక్కువ వడ్డీతో అప్పులు తీసుకుంది గత సర్కారు. మొత్తం కార్పొరేషన్ల అప్పులు ఒక ఎత్తు అయితే? ఐదు కార్పొరేషన్లవే ఏకంగా 95 శాతం బాకీలున్నాయి. అందులో నెంబర్ వన్ లాస్ కంపెనీ కాళేశ్వరం కార్పొరేషన్. ఆ తర్వాత డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్, వాటర్ రీసోర్స్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, గొర్రెల కార్పొరేషన్ వంటివి ఉన్నాయి.ఇవే 95 శాతం అప్పులు తెచ్చుకున్నాయి. తెస్తే తెచ్చాయి.. కానీ మార్కెట్ లో ఒక వడ్డీ రేటు ఉంటే అంతకంటే ఎక్కువ పెట్టి తేవడంలో లాజిక్స్ ఏంటన్నది తేల్చే పనిలో ఉన్నారు. మార్కెట్ లో ఇంట్రెస్ట్ రేట్ యావరేజ్ గా 7.63 శాతంగా ఉంది. కానీ ఏకంగా 10.49% వడ్డీతో లోన్లు తెచ్చింది గత సర్కార్. ఇలా ఎవరైనా చేస్తారా? ఇది ఎంత గుదిబండో అర్థం చేసుకోలేకపోయారా? ఓన్లీ అడిగినంత అప్పులు ఇస్తే చాలు అనుకున్నారా?కాళేశ్వరం కార్పొరేషన్ పై 9.69% ఇంట్రెస్ట్ రేటుతో 74 వేల 599 కోట్ల రూపాయలు అప్పు చేశారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్ పై 9.48% వడ్డీ రేటుతో 20,200 కోట్లు అప్పులు చేశారు. వాటర్ రీసోర్స్ కార్పొరేషన్ పై అత్యధికంగా 10.49% ఇంట్రెస్ట్ తో 14 వేల 60 కోట్ల రూపాయలు బాకీలు తెచ్చారు. ఇది ప్రభుత్వ ఖజానాపై ఎంతలా భారం మోపుతోందో ప్రస్తుత ప్రభుత్వానికి అర్థమవుతోంది. ఇక హౌసింగ్ కార్పొరేషన్ పై 9 వేల కోట్లు, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ పై 2,951 కోట్ల రుణాలు ఉన్నాయి.గొర్రెల కార్పొరేషన్ కింద గత ప్రభుత్వం గొర్రెల స్కీం కోసం 4 వేల కోట్లు, చేపల కోసం మరో 600 కోట్ల అప్పు చేసింది. ఇక హాస్పిటల్స్ నిర్మాణాల కోసం కూడా 3,535 కోట్లు కార్పొరేషన్ల కిందనే బాకీలు తీసుకుంది. అయితే ఇందులో హౌసింగ్ వంటి వాటికి కచ్చితంగా రుణాలు తీసుకోవాల్సినవే. అయితే ఎక్కువ వడ్డీ రేట్లకు బాకీలు తేవడమే ఇప్పుడు ఖజానాను ఖతం చేస్తోంది. తెలంగాణలో కార్పొరేషన్లు ఎలా అప్పుల ఊబిలో ఉన్నాయో చూశాం కదా. వీటితో రోజులు గడిచేకొద్దీ నష్టాలే తప్ప లాభాలు ఉండవు.

అందుకే కార్పొరేషన్లను సెట్ చేయడం, లోన్లను రీస్ట్రక్చర్ చేయడం, సాధ్యమైనంత వరకు అసలు, బాకీలు తీర్చుకుంటూ వెళ్లడమే రేవంత్ సర్కార్ టార్గెట్ గా పెట్టుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ అధిక వడ్డీలకు కేసీఆర్ తెచ్చిన ఈ లోన్ల రీ స్ట్రక్చరింగ్ పై రిక్వెస్టులు చేస్తూ వస్తున్నారు. కొంత వరకు సక్సెస్ అయ్యారు కూడా. ఓవైపు గత ప్రభుత్వం సృష్టించిన అప్పుల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తుంటే విపక్షం మాత్రం ఇప్పటి ప్రభుత్వమే అప్పుల మీద అప్పులు చేస్తోందని విమర్శలు చేయడమే విడ్డూరం.

# భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం భారతరత్న

**-భారతరత్న పురస్కారం స్థాపించబడింది**

**ఈరోజే (జనవరి 2, 1954)**

**( పెండ్యాల రామ్ కుమార్, మంథని )**





భారతరత్న పురస్కారం భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత స్థాపించబడింది. ఈ పౌర పురస్కారం కళ, సాహిత్య, విజ్ఞాన, క్రీడా రంగాలలో అత్యుత్తమ కృషికి ప్రదానం చేస్తారు. ఇప్పటివరకు నలభై మందికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వారిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ పురస్కారం 1977 జూలై 13 నుండి 1980 జనవరి 26 వరకు జనతా పార్టీ పాలనలో కొద్దికాలం పాటు నిలిపివేయబడింది. ఒకే ఒక్కసారి 1992లో సుభాష్ చంద్రబోస్కు ఇవ్వబడిన పురస్కారం చట్టబద్ధ సాంకేతిక కారణాల వల్ల వెనుకకు తీసుకొనబడింది.ఎలాంటి జాతి, ఉద్యోగం,స్థాయి లేదా స్త్రీ పురుష వ్యత్యాసం లేకుండా ఈ పురస్కారం ఇవ్వబడుతుంది. ఈ పురస్కారగ్రహీతల జాబితాను ప్రధానమంత్రి రాష్ట్రపతికి సిఫారసు చేయవలసి ఉంటుంది.భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది (మొదటిది ఆరూ- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్లు, మాజీ రాష్ట్రపతులు, ఉపప్రధాన మంత్రి, ముఖ్య న్యాయాధీశులు). కానీ ఈ గౌరవం వలన ఎలాంటీ అధికారాలు లేదా పేరు ముందు ప్రత్యేక బిరుదులూ రావు.ఈ పురస్కారం పొందిన విదేశీయుల జాబితాలో సరిహద్దు గాంధిగా పేరుపొందిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ (1987), నెల్సన్ మండేలా (1990) ఉన్నారు. 1954, జనవరి 2వ తేదీన రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు భారత రాష్ట్రపతి యొక్క కార్యదర్శి కార్యాలయం నుండి ఒక ప్రకటన జారీ అయ్యింది. వాటిలో మొదటిది అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న కాగా రెండవది దానికన్నా తక్కువ స్థాయి గల మూడంచెల పద్మవిభూషణ్ పురస్కారం. పద్మవిభూషణ్ పురస్కారం ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గాలుగా విభజించారు. 1955, జనవరి 15న పద్మవిభూషణ్ పురస్కారాన్ని పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు వేర్వేరు పురస్కారాలుగా పునర్వర్గీకరించారు.భారతరత్న పురస్కారం కేవలం భారతీయులకే ప్రదానం చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ఈ పురస్కారాన్ని భారత పౌరసత్వం స్వీకరించిన మదర్ థెరీసాకు 1980లో, మరో ఇద్దరు విదేశీయులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్కు 1987లో, నెల్సన్ మండేలాకు 1990లో ప్రదానం చేశారు. ప్రఖ్యాత క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్కు తన 40వ యేట ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం లభించినవారిలో ఇతనే అతి పిన్నవయస్కుడు, మొట్టమొదటి క్రీడాకారుడు. సాధారణంగా భారతరత్న పురస్కార ప్రదాన సభ రాష్ట్రపతి భవన్, ఢిల్లీలో జరుగుతుంది. కానీ 1958, ఏప్రిల్ 18వ తేదీన బొంబాయిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధొండొ కేశవ కర్వేకు అతని 100వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఇతడు జీవించి ఉండగా ఈ పురస్కారం అందుకున్నవారిలో అతి పెద్ద వయస్కుడు. 2015 నాటికి ఈ పురస్కారాన్ని మొత్తం 45 మందికి అందజేయగా వారిలో 12 మందికి మరణానంతరం లభించింది. చరిత్రలో ఈ పురస్కారం రెండుసార్లు రద్దు చేయబడింది. మొదటి సారి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 1977, జూలై 13వ తేదీన అన్ని పౌరపురస్కారాలను రద్దుచేశారు. తరువాత ఈ పురస్కారాలు 1980, జనవరి 25న ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత పునురుద్ధరించబడ్డాయి.

1992లో ఈ పురస్కారాల "రాజ్యాంగ సాధికారత"ను సవాలు చేస్తూ కేరళ, మధ్యప్రదేశ్ హైకోర్టులలో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ పురస్కారాలను రెండవసారి రద్దు చేశారు. ఈ వ్యాజ్యాలకు ముగింపు పలుకుతూ 1995 డిసెంబరులో సుప్రీం కోర్టు ఈ పురస్కారాలను మళ్ళీ పునరుద్ధరించింది. ఇప్పటివరకు 54 మందికి భారతరత్న అవార్డు ప్రధానం చేశారు.

# రహదారి భద్రత సమాజంలో అందరి బాధ్యత

**సూర్యాపేట** :కోదాడ మోటార్ వెహికల్ ట్రాన్స్ పోర్ట్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ప్రారంభం. రహదారి భద్రత సమాజంలో అందరి బాధ్యత అని టిపిసిసి చైర్మన్ సిహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మునిసిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్ లు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో కోదాడ మోటార్ వెహికల్ ట్రాన్స్ పోర్ట్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా పట్టణంలోని బిఎస్ఎన్ఎల్, బస్టాండ్ అడ్డాల టాక్సీ డ్రైవర్లకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలకు అజాగ్రత్త ఒక్కటే ప్రధాన కారణమని జాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు జరగవు అన్నారు ప్రభుత్వం నిర్ణయించిన రోడ్డు భద్రత నిబంధనలను డ్రైవర్లు పాటించాలని సూచించారు. వాహనాల డ్రైవింగ్లో నిర్లక్ష్యం వహిస్తే తమ ప్రాణం తో పాటు ఇతరుల ప్రాణాలు కూడా పోతాయని హెచ్చరించారు. మద్యపానం సేవించి వాహనాలు నడపడం అతివేగం అజాగ్రత్త, ఓవర్ లోడ్ వంటివి ప్రమాదాలకు కారణం అవుతున్నాయన్నారు. కోదాడ మోటార్ ట్రాన్స్పోర్ట్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలాని మాట్లాడుతూ ప్రతి వాహన డ్రైవర్ రోడ్డు భద్రత నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు, నిబంధనలను అతిక్రమించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా రవాణా శాఖ ప్రమాదాల నివారణకు అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. జనవరి ఒకటి నుంచి జనవరి 31 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్స వాలను నిర్వహించి రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జాతీయ రహదారిపై కోదాడ పరిధిలో ఎక్కడెక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందో ఆయన డ్రైవర్లకు వివరించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించి ఆనందంగా జీవించాలని సూచించారు పై అధికారుల ఆదేశాల మేరకు వాహనదారులకు ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు భద్రత




మహోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కోదాడ ఎం విఐ జిలాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎల్ఎన్ ప్రసాద్ ,లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని శ్రీనివాసరావు, బిఎస్ఎన్ఎల్ టాక్సీ అడ్డ అధ్యక్షులు గరిడేపల్లి రమేష్ ,కార్యదర్శి చేపల శీను, వైస్ చైర్మన్ వాసు, బస్టాండ్ టాక్సీ అడ్డ అధ్యక్షులు పల్లపు వెంకన్న, వైస్ చైర్మన్ ఉసిరికాయల సుబ్బయ్య, కార్యదర్శి ఇరుగు నిరంజన్ ,ఆయా టాక్సీ అడ్డాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 4వ తేదీలోపు 2025-26 సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు

**- అన్ని శా ఖలకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్ర ధాన కార్యదర్శి ఉత్తర్వు లు జారీ**




**హైదరాబాద్** వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను జనవరి 4వ తేదీలోపు ఆన్లైన్లో అప్లోడ్ చేయాల్సిందిగా అన్ని శా ఖలకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్ర ధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వు లు జారీ చేసారు. ఆర్థిక సంవత్సరం 2024-25 బడ్జెట్ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటూనే, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన రివైజ్డ్ బడ్జెట్ అంచనాలను రూపొందించుకోవాలని ఆర్థికశాఖ సూచించింది. ప్రభుత్వ ప్రాధాన్యతలు, అమలు చేస్తోన్న ప్రస్తుత సంక్షేమ, పథకాలతో పాటు అభివృద్ధి కా ర్యక్రమాలకు అవసరమైన నిధులతో పాటు సామాజి క, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రతిపాదనలు తయారు చే యాలని సర్క్యూలర్లో పే ర్కొన్నారు.అలాగే వచ్చే ఆ ర్థిక సంవత్సరంలో అమ లు చేయనున్న వాటికి సం బంధించిన అంచనాలను చేర్చి ప్రతిపాదనలు తయారు చేయాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించిన జీ తభత్యాలు, అలవెన్స్లు, కాంట్రాక్టు, అవుట్ సో ర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అవసరమైన ని ధుల అంచనాలను కూడా సమర్పించాల్సిఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఉద్యోగులే కాకుండా కొత్తగా నియామకం అయ్యే ఉద్యోగ నియామకాలను దృష్టిలో పెట్టుకొని వాటి అంచనాలను కూడా బడ్జెట్లో ప్రతిపాదన రిమార్క్ కాలమ్లో పేర్కొనాల్సి ఉంటుందని సూచించింది. వచ్చే ఆర్థిక సం వత్సరంలో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను, రా ష్ట్రం చెల్లించిన పన్నుల నుంచి వచ్చే వాటాలను అంచనా వేసి ఈ ప్రతిపాదనలను తయారు చేయా ల్సి ఉంటుందనిఆర్థికశాఖ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయ రాబడితో పాటు ప్రభుత్వ నిర్వాహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. బడ్జెట్ అంచనాలు రూపొందించడంలో సమర్థవంతమైన పరిపాలన, మౌలిక సదుపాయాల మెరుగు, ఉపాధి అవకాశాల పెంపుదలతో పాటు రాష్ట్రం ఆర్థికంగా ఎదుగుదల, సమాజంలో ఆర్థిక అసమానలతలను రూపుమాపడం, రాష్ట్ర ఆర్థిక నిలువలను, ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించడం ప్రధాన లక్షంతో పాటు సమర్థవంతమైన పరిపాలన అందించే ఉద్దేశ్యంగా రివైజ్డ్ బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితులలో జనవరి 4 వ తేది గడువు లోగా ప్రతిపాదనలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని ఆర్థికశాఖ ఆదేశించింది.

# ముగ్గురు ఆడ పిల్లలకు జన్మనిచ్చినందుకు భార్యను భర్త తగలబెట్టిన భర్త

**ముంబయి** ముగ్గురు ఆడ పిల్లలకు జన్మనిచ్చినందుకు భార్యను భర్త తగలబెట్టిన సంఘటన మహారాష్ట్రలోని పరబణిలో జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? గ్యంగాఖేడ్ ప్రాంతంలో కందిక్ ఉత్తమ్ కాలే(32), మైనా(27) అనే దంపతులు నివసిస్తున్నారు. ఈ దంపతులు ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ముగ్గురు ఆడ పిల్లలకు జన్మనివ్వడంతో భార్యను ఉత్తమ్ వేధించేవాడు. దీంతో భార్యభర్తల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. రెండో రోజుల క్రితం ఇద్దరు మధ్య గొడవ జరిగింది. ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో భార్యపై పెట్రోల్ పోసి భర్త తగలబెట్టాడు. దీంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పేసి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. మైనా సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**- ఆలయ అధికారులకు టిటిడి ఇఒ జె.శ్యామల రావు ఆదేశం**



**తిరుపతి** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి సమీపంలోని వెంకటపాలెం వద్ద వున్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని టిటిడి ఇఒ జె.శ్యామల రావు సందర్శించారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన రోజువారి వివరాలను టిటిడి ఈవోకు ఆలయ అధికారులు వివరించారు.శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి నిలిచిపోయిన అభివృద్ధి పనులను, నిర్మాణానికి సంబంధించిన వివరాలను, ఆలయంలో రోజువారి జరుగుతున్న కైంకర్యాలను, దాతల సహకారంతో ఇప్పటికే జరుగుతున్న అన్నదాన కార్యక్రమ వివరాలను, ఇతర కార్యక్రమాలను ఈవోకు అధికారులు తెలియజేశారు.టిటిడి సిబ్బందికి అవసరమైన క్వార్టర్స్ , అన్నదానానికి అవసరమైన భవనాలు, భక్తులు వేచియుండేందుకు హాల్, స్వామివారి వాహనాల కోసం వాహనమండపం, ఆహ్లాదకరంగా గార్డెనింగ్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఆలయ నిర్మాణానికి ముందు తయారు చేసిన ప్లాన్ ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని టిటిడి ఇంజనీరింగ్ అధికారులను ఈవో ఆదేశించారు. నూతన ఆంగ్ల సంవత్సరాది జనవరి 1వ తేదీ, వైకుంఠ ఏకాదశి రద్దీ నేపథ్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతకుముందు ఆలయానికి ఈవో చేరుకోగానే సాంప్రదాయ బద్ధంగా ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి వేదశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, డిప్యూటీ ఇఒ నాగభూషణం, సూపరెంటెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇస్పెక్టర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 1 నుండి పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

**తిరుపతి** : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను జనవరి ఒకటో తేదీ నుండి ట్రెజరీ కార్యాలయంలో స్వీకరిస్తామని జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షన్ దారులు ప్రతి సంవత్సరం కూడా జనవరి 1 నుండి ఫిబ్రవరి నెల ఆఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్ డిజిటల్ పద్ధతిలో జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చు అని, అందుకొరకు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబరు, పిపిఒ నంబరు (పింఛన్ పుస్తకం), బ్యాంకు ఖాతా వివరాలు తీసుకొని ట్రెజరీ కార్యాలయంలో గాని, మీసేవ కేంద్రం లో గాని, మరియు ఇంటర్నెట్ సెంటర్లో గానీ, పింఛన్ దారుల సంఘంలో గాని లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పెన్షనర్లకు సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ప్రజాప్రశ్న

హైదరాబాద్, గురువారం 2, జనవరి 2025

# ఎయిడ్స్‌కు టీకా...

**లండన్ :** ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ వ్యాధికి టీకా వచ్చేసింది. ఈ టీకా కోసం ప్రపంచం కొన్ని సంవత్సరాలుగా కళ్లు కాయలు కాచే విధంగా ఎదురుచూస్తోంది. 2000 నుంచి 2008 వరకు ప్రపంచం మొత్తం ఎయిడ్స్ అంటే భయపడిపోయింది. ఐక్యరాజ్య సమితి ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఆసియా, ఆఫ్రికా అని తేడా లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి ఎయిడ్స్ నివారణ పై.. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేసింది. బహిరంగ ప్రదేశాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. నాడు పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా అనే యాడ్ విస్తృతంగా ప్రచారం, ప్రసారం కావడానికి ప్రధాన కారణం కూడా అదే. అయితే ఎయిడ్స్ వల్ల నాటి రోజుల్లో లక్షలాది మంది చనిపోయారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో చాలామంది కన్నుమూశారు. ఎయిడ్స్ వచ్చిన వారిని సామాజికంగా బహిష్కరించడంతో నరకం చూశారు. అందువల్లే ఎయిడ్స్ పై ప్రపంచ దేశాలు యుద్ధం ప్రకటించాయి. నివారణకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాయి. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అయితే సెలబ్రిటీలు తమ బాధ్యతగా ఎయిడ్స్ నివారణ పై ప్రచారం నిర్వహించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమవంతుగా వివరించే ప్రయత్నం చేశారు. 2009 తర్వాత జరిగిన పరిశోధనల అనంతరం ఎయిడ్స్ నివారణకు మందులు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఎయిడ్స్ తగ్గకపోయినప్పటికీ.. రోగి జీవిత కాలాన్ని పెంపొందించే అవకాశం దక్కింది. పరిశోధనలు నిత్యం జరగడం వల్ల కొత్త కొత్త మందులు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఎన్ని మందులు అందుబాటులోకి వచ్చినా ఎయిడ్స్ నివారణ మాత్రమే సాధ్యమైంది. రోగి జీవితకాలం పెంపొందించడం మాత్రమే సాధ్యపడింది. కానీ ఎయిడ్స్ నిర్మూలన అనేది వీలు కాలేదు. అయితే ఇప్పుడు ప్రపంచానికి శుభవార్త చెప్పే విధంగా ఎయిడ్స్ శాశ్వత నిర్మూలనకు వ్యాక్సిన్ వచ్చింది. గిలీడ్ సైన్సెస్ అనే సంస్థ ఒవనిజీఇ-జీజూజూజీలతితీ అనే టీకాకు జూ ఈఆం ఆమోదం తెలిపింది.. వచ్చే మూడు సంవత్సరాలలో ఈ టీకా 20 లక్షల మంది దాకా చేరుతుంది. దక్షిణాఫ్రికా, టాంజానియా ప్రాంతాలలో ఈ వ్యాక్సిన్ కు సంబంధించి ట్రయల్ నిర్వహించారు. దీనివల్ల మెరుగైన ఫలితాలు వచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దక్షిణాఫ్రికా, టాంజానియా లో ఎయిడ్స్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ మరణాలు కూడా అదే సంఖ్యలో చోటు చేసుకుంటున్నాయి. అందువల్లే ఇక్కడ ట్రయల్స్ నిర్వహించారు. అవి విజయవంతం కావడంతో ఎయిడ్స్ టీకాకు జూ ఈఆం ఆమోదం తెలిపింది.. ప్రతి ఏడాది రెండుసార్లు ఈ టీకా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే దీని ధర ఎంత అనేది బయటికి చెప్పలేదు. వ్యాక్సిన్ బయటికి రావడంతో.. మరో మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. రకరకాల అపహాలు చెలరేగుతున్నాయి. వ్యాక్సిన్ ధర పేదలకు అందుబాటులో ఉండదని.. కేవలం శ్రీమంతులకు మాత్రమే దీనిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని.. ఐక్యరాజ్యసమితి అనుబంధ ఆరోగ్య విభాగం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఈ వ్యాక్సిన్ ను పేద దేశాలకు ఉచితంగా అందించాలనే డిమాండ్లు మొదలయ్యాయి. అయితే ఈ వ్యాక్సిన్ ను కేవలం గిలీడ్ సైన్సెస్ మాత్రమే అభివృద్ధి




చేసిన నేపథ్యంలో.. దానికి మాత్రమే పేటెంట్ రైట్స్ ఉంటాయని తెలుస్తోంది. ఈ వ్యాక్సిన్ తయారీకి ఆ కంపెనీ భారీగా నగదు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. ఎయిడ్స్ 1983లో వెలుగులోకి వచ్చింది. దీనిని మొట్టమొదటిసారిగా అమెరికాలో గుర్తించారు. ఆ తర్వాత ఈ వ్యాధి అన్ని దేశాలకు విస్తరించింది. ఎయిడ్స్ అనేది ప్రపంచ దేశాలకు పెను ముప్పుగా మారింది. దీంతో ఎయిడ్స్ కు మందు లేదు.. నివారణ మాత్రమే సాధ్యం అనే నినాదం అప్పట్లో పుట్టుకొచ్చింది. ఎయిడ్స్ వల్ల ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా 4.2 కోట్ల మంది చనిపోయారు. మొత్తంగా 8.8 కోట్ల మందికి ఈ వ్యాధి సోకింది. గత ఏడాది చివరి నాటికి నాలుగు కోట్ల మంది ఎయిడ్స్ తోనే బతికీడుస్తున్నారు.. వారు మందులు వాడుతూ తమ జీవిత కాలాన్ని పెంచుకుంటున్నారు.

# పవన్ వన్ సైడ్ అవుతున్నారా..

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నారు. ఆయన ఏపీలో కూటమి ఏర్పాటు కావడానికి ప్రధాన కారణం. ఒకరకంగా బీజేపీ, టీడీపీని ఒక వేదికపైకి చేర్చడానికి పవన్ కల్యాణ్ ముఖ్య కారణం. పవన్ కల్యాణ్ వల్లనే ఆంధ్రప్రదేశ్ లో కూటమి విజయం సాధించింది. మరోవైపు నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలతో సత్సంబంధాలతో పాటు సాన్నిహిత్యం కూడా ఉంది. అలాగే పవన్ కల్యాణ్ అన్నా కూడా ఢిల్లీ పెద్దలకు ప్రేమ, గౌరవం కూడా. పవన్ కల్యాణ్ ను రాజకీయంగా ఎలా ఉపయోగించుకోవాలో కేంద్ర నాయకత్వం కూడా ఆలోచిస్తుంది. అదే సమయంలో దక్షిణ భారత దేశంలో క్రౌడ్ పుల్లర్ గా కూడా పవన్ కల్యాణ్ ను సెంట్రల్ పార్టీ గుర్తిస్తుంది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం కాంగ్రెస్ ముఖ్యమంత్రిని వెనకేసుకు రావడం, పొగడ్తలతో ముంచెత్తడం, ప్రశంసలను కురిపించడం ఇప్పుడు ఏపీలోనే కాదు ముఖ్యంగా తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. సంధ్య థియేటర్ లో జరిగిన ఘటనపై పవన్ కల్యాణ్ తొలిసారి మీడియా ముందు స్పందించారు. అయితే ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి తప్పేమీ లేదన్నట్లు ఆయన అన్నారు. రేవంత్ స్థానంలో ఎవరున్నా అదే చేసేవారని, రేవంత్ సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కూడా కొనియాడరు. ఈ ఘటనలో పుష్ప టీం తప్పేనంటూ పవన్ కల్యాణ్ తెగేసి చెప్పారు. అంతేకాదు ఒకరకంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వెనకేసుకు వచ్చారు. అయితే దీనిపై బీజేపీ నేతలు మాత్రం ఒకింత అసహనంతో ఉన్నట్లు తెలుస్తుంది. ముందస్తు బెయిల్ కు యత్నం బీజేపీ నేతలు మాత్రం... పుష్ప ఘటన తర్వాత జరిగిన పరిణామాలపై ఇటు ఏపీ బీజేపీలోని నేతలు, అటు తెలంగాణ బీజేపీ యావత్తూ అల్లు అర్జున్ వైపు నిలబడింది. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా అనేక స్టేట్ మెంట్లు ఇచ్చారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు అల్లు అర్జున్ ను వెనకేసుకు వచ్చారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి సయితం కూడా అల్లు అర్జున్ తప్పేమీ లేదని ప్రకటన చేశారు. కానీ ఇందుకు విరుద్ధంగా కూటమిలో ఉన్న పవన్ కల్యాణ్ మాత్రం తప్పు అల్లు అర్జున్ టీందేనని తేల్చి చెప్పడంతో రేవంత్ కు మరింతగా క్రేజ్ పెరిగిందంటున్నారు. ఇప్పటి వరకూ మెగా ఫ్యాన్స్, బన్నీ ఫ్యాన్స్ లో ఒకింత వ్యతిరేకత ఉన్నప్పటికీ పవన్ కల్యాణ్ స్టేట్ మెంట్ తో కొంత మైలేజీ పెరిగిందన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. సున్నితమైన అంశంపై... మిత్రపక్షంగా ఉన్నప్పుడు ఒక సున్నితమైన అంశంపై మౌనంగానైనా ఉండాలి. లేదంటే మిత్రపక్షంలోని పార్టీలకు అనుగుణంగా వ్యవహరించాలి. అంతే తప్ప అందుకు విరుద్ధంగా ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రిపై ప్రశంసలు కురిపించడం ఏంటన్న ప్రశ్నలు ఇప్పుడు కమలనాథుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

అయితే పవన్ కల్యాణ్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడే రకం కావడంతో ఆయన తన మనసులో ఉన్నది ఆఫ్ ది రికార్డులో చెప్పారని, అంటే చిట్ చాట్ లోనే ఆయన ఈ రకంగా



స్పందించారని, బహిరంగ వేదికలపై ఎక్కడా ఈ విషయంపై రెస్పాన్స్ కాలేదన్న విషయాన్ని కూడా జనసేన నేతలు గుర్తు

# గ్రాడ్యుయేట్ ఎన్నికకు గులాబీ దూరమేనా

**కరీంనగర్ :** ఎన్నిక ఏదైనా.. రాష్ట్రంలో ఏ మూలన ఏ పోస్ట్‌కు ఎలక్షన్స్ జరిగినా..ఒకప్పుడు గులాబీ పార్టీ హవానే వేరు. బీఆర్ఎస్ పార్టీకి పోటీగా అభ్యర్థిని బరిలోకి దింపాలంటేనే ఆలోచించే పరిస్థితి. సీన్ కట్ చేస్తే ఇప్పుడదే పార్టీ..పోటీ చేయాలా వద్దా అని డైలమాలో ఉందట. కంచుకోటగా ఉన్న ఆ నాలుగు జిల్లాల్లో వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కంటెస్ట్ చేయొద్దని భావిస్తోందట. ఆశావహులు ఉన్నా..టికెట్ కోసం నేతలు పోటీ పడుతున్నా.. అధిష్టానం మాత్రం రుకో జర సబర్ కరో అంటోందట.మార్చిలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటుకు ఎన్నికలు రాబోతున్నాయి. ఆ సీటులో సీనియర్ నేత జీవన్‌రెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్నారు. గతంలో ఈ సీటును రెండుసార్లు గెలుచుకుంది బీఆర్ఎస్. కానీ ఇప్పుడు పోటీ చేయాలంటేనే ఆలోచిస్తోంది.తెలంగాణ ఉద్యమ సమయంలో కోరి మరీ ఎన్నికలను తెచ్చుకున్న గులాబీ పార్టీ అపోజిషన్‌లోకి వచ్చేసరికి డీలా పడిపోయింది. అంతేకాదు వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఫైట్‌లో ఓటమి..లోక్‌సభ ఎన్నికల్లో పరాభవంతో..కారు రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. పోటీ చేసి ఓడిపోతే..పార్టీ వీక్ అయిందన్న టాక్ పోతుంది..అందుకే పోటీనే చేయకపోతే బెటరనే ఆలోచన చేస్తున్నారట గులాబీ బాస్.కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి సభ్యుల ఎన్నికలు, కరీంనగర్ స్థానిక సంస్థల కోటా మండలి ఎన్నికలు వచ్చేనెల మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉంది. శాసనమండలి ఎన్నికలు కావడంతో సిట్టింగ్ శాసన మండలి సభ్యుల పదవీకాలం పూర్తికాకముందే ఈ ఎన్నికలను ఎన్నికల సంఘం పూర్తి చేస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఈ మూడు సీట్లలో పోటీపై గులాబీ పార్టీ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది.ప్రస్తుత రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగానే ఉండాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎంతోమంది ఆశావహులు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నా..పార్టీ పెద్దలు మాత్రం ఈ వ్యవహారంపై దృష్టి పెట్టకపోవడంతో నేతలు కూడా ఆశలు వదులుకుంటున్నట్లు తెలుస్తోంది.సాధారణ ఎన్నికలతో పోలిస్తే అతి తక్కువ మంది ఓటర్లు ఉండే ఈ ఎన్నికల్లో పోటీ చేసినా సానుకూల ఫలితాలు దక్కే అవకాశం లేదని గులాబీ పార్టీ అంచనా వేస్తుందట. ఈ స్థానాల్లో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోయినా..ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ చేసినా విజయం దక్కించుకోలేమన్న అభిప్రాయంతో గులాబీ దళపతి ఉన్నట్లు టాక్. అందుకే పోటీకి దూరంగా ఉండాలన్న సంకేతాలు ఇచ్చారని తెలుస్తోంది.కొంతమంది ఆశావాహులు పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నా..పార్టీ నిర్ణయం తీసుకోకపోవడంతో డిఫెన్స్‌లో పడ్డట్టు తెలుస్తుంది. పార్టీ అధికారి కంగా అభ్యర్థిని అనౌన్స్ చేసి సహకరిస్తేనే పోటీకి తాము సిద్ధమన్న అభిప్రాయాన్ని కొంతమంది నేతలు వ్యక్తం చేస్తున్నారు.ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విషయం ఇలా ఉంటే..స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ప్రభావం చూపించకపోవచ్చని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారట. ఈ కారణంగానే ఎన్నికలకు దూరంగా ఉండాలన్న అభిప్రాయంతో బీఆర్ఎస్ అధినేత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసరికి గులాబీ పార్టీ అధిష్టానం ఆలోచన మారుతుందా..లేక పోటీకే దూరంగానే ఉంటారా అన్నది వేచి చూడాలి.

# మళ్లీ యాక్టివ్‌గా హైడ్రా...

**హైదరాబాద్ :** హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. తన పరిధిలో చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే.. నిబంధనలు, అనుమతులు అంటూ కాలయాపన చేయకుండా ప్రజా ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని కాపాడుకునేందుకు తక్షణమే రంగంలోకి దిగుతుంది. ఈ క్రమంలోనే హైడ్రా తాజాగా శేరిలింగం పల్లిలో అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. ఇక్కడి భగీరథమ్మ, తౌతానికుంట చెరువుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను పంపింది. హైదరాబాద్ నగర నిర్మాణం, అభివృద్ధితో పాటు ఇక్కడ ప్రకృతి సంపదల్ని.. తరాల పాటు ప్రజల అవసరాల్ని కాపాడేలా చేపట్టిన చర్యల్లో హైడ్రాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. విశేష అధికారాలు, ప్రభుత్వ పూర్తి అండదండలతో తమపర భేదం లేకుండా.. ఎక్కడ తప్పు జరిగితే అక్కడ హైడ్రా ప్రత్యక్షమవుతోంది. తనకు కేటాయించిన బాధ్యతల్ని తూ.చా తప్పకుండా ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు లొంగకూండా పనిచేసుకుంటూ పోతుంది. అందులో భాగంగా.. కొత్త ఏడాది వేడుకలకు ముందు సైతం తన పవర్ చూపిస్తోంది. చెరువులు, కుంటల జోలికి వస్తే ఊరుకునేది లేదని తేల్చి చెబుతోంది. శేరిలింగంపల్లి మండలంలో పరిధిలోని ఖాజాగూడ ? నానక్ రామ్ గూడ ప్రధాన రహదారికి ఇరువైపులా భగీరథమ్మ, తౌతానికుంట చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని రీతిలో పుంజుకుని పరుగులు తీస్తోంది. అందుకే.. అక్రమార్కుల కళ్లు.. ఈ చెరువులపై పడ్డాయి. దాంతో.. రేకులతో ఆ స్థలాలను తమవిగా చెప్పుకుండా అడ్డుగోడ కట్టేశారు. దాంతో.. రంగంలోకి దిగిన హైడ్రా వెంటనే కూల్చివేతలు చేపట్టింది. ఈ చెరువుల భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని.. స్థానికులు ఫిర్యాదుల చేయడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతవారంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఫిర్యాదు అందిన ప్రాంతంలో చెరువుల భూముల్లోనే నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు జరిగినట్టు అధికారులు నిర్ధరించారు. దాంతో.. రంగంలోకి దిగిన హైడ్రా మంగళవారం నాడు కూల్చివేతలు చేపట్టింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ప్రొక్లేన్ సాయంతో అక్కడి చేరుకున్న ప్రభుత్వ సిబ్బంది.. 10 ఆక్రమణలను కూల్చివేశారు. రేకుల షెడ్డలతో పాటు రేకుల ప్రహరీ నిర్మించి ఆక్రమణలు చేసినట్టు గుర్తించిన అధికారులు.. వాటిని పూర్తిగా కూల్చివేశారు. నోటీసులు అందజేసిన తర్వాత కూల్చివేతలు ప్రారంభించిన అధికారులు.. కూల్చివేతలతో 10 ఎకరాల వరకు ప్రభుత్వ, చెరువు భూముల స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో అక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. అక్రమణలపై నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి స్వచ్ఛందా అనేక ఫిర్యాదులు అందుతున్నాయి.

వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే కూల్చివేతలకు పాల్పడుతున్నారు. పక్కా సమాచారం, సాంకేతిక ఆధారాలను దగ్గర పెట్టుకుని కూల్చివేతలు చేపడుతున్నారు. నూతన ఏడాది వేడుకలకు ముందు హైడ్రా దూకుడుతో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటల్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి కంటి మీద కునుకు ఉండడం లేదు. ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో హైడ్రా మరింత దూకుడుగా ముందుకు వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పట్టుదల, చెరువుల్ని రక్షించాలనే సంకల్పంతో.. అక్రమార్కులపై మరిన్న చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. అలాగే.. త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్లు సైతం రానుండడంతో హైడ్రాకు ప్రత్యేక అధికారాలు రానున్నాయి.

# ప్రతి ఆరుగురిలో ఒకరు... టీడీపీ సభ్యుడు

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది సభ్యత్వ నమోదులో దూసుకుపోతోంది. ఇప్పటివరకు దాదాపు 94 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ కనిపిస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 26న టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత చంద్రబాబు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత 63 రోజుల్లో ప్రతిరోజు సగటున లక్షన్నర మంది సభ్యత్వం తీసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. డిసెంబర్ 31 తో సభ్యత్వ నమోదు ప్రక్రియ ముగిసింది. కానీ సంక్రాంతి వరకు పొడిగించాలని అధినేత చంద్రబాబు తో పాటు లోకేష్ కు పార్టీ శ్రేణుల నుంచి వినతులు అందాయి. పార్టీ క్యాడర్ తో పాటు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో మరో 15 రోజులపాటు సభ్యత్వ నమోదు గడువు పెంచాలని హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. గతానికి భిన్నంగా ఈసారి పూర్తి డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఘోర పరాజయం ఎదురయింది. దీంతో పార్టీ పని అయిపోయిందని అంతా భావించారు. కానీ నారా లోకేష్ మాత్రం పార్టీ పటిష్టత కోసం చాలా రకాల చర్యలు చేపట్టారు. గత ఐదేళ్ల కాలంలో కార్యకర్తల సంక్షేమం కోసం రూ.138 కోట్లు ఖర్చు చేశారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. సభ్యత్వ నమోదులో నెల్లూరు సిటీ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది.

× సభ్యత్వ నమోదులో తొలి పది స్థానాలు సాధించిన నియోజకవర్గాలు

1, నెల్లూరు సిటీ- 1,46, 966
2. పాలకొల్లు- 1,44,992
3. ఆత్మకూరు- 1,34, 584
4. రాజంపేట- 1,29,783
5. కుప్పం- 1,28, 496
6. ఉండి- 1,14, 443
7. గురజాల- 1,08,839
8. వినుకొండ- 1,05,158
9. మంగళగిరి- 1,04, 122
10. కళ్యాణదుర్గం- 1,00,325 సభ్యత్వాలతో ముందు వరుసలో ఉన్నాయి.

# ఆ ఇద్దరిలో ఎవరికి...

**హైదరాబాద్ :** తెలంగాణ కాషాయ దళపతి రేసులో చాలా మంది నేతల పేర్లు వినిపించాయి. బండి సంజయ్‌ని మళ్లీ అధ్యక్షుడిగా నియమిస్తారని ప్రచారం జరిగింది. ఈటల రాజేందర్‌కు పార్టీ పగ్గాలు ఇస్తారని లీకులు వచ్చాయి. డీకే అరుణ, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, రామచందర్‌రావు పేర్లు పార్టీ అధ్యక్ష రేసులో బలంగా వినిపించాయి. అయితే అందరినీ కలుపుకుపోయే ఫైర్ బ్రాండ్ లీడర్ కోసం అధిష్టానం దృష్టి పెట్టిందటతెలంగాణలో ఎనిమిది ఎంపీలను గెలుచుకున్న బీజేపీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అధికారం చేజిక్కించుకోవాలని లెక్కలు వేసుకుంటోంది. అందుకే ఈసారి పార్టీ అధ్యక్షుడి ఎంపికలో చాలా అంశాలను బేరీజు వేసుకుంటోంది.

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి రేసులో ఎప్పటికప్పుడు కొత్త పేర్లు బయటికి వస్తుండటంతో ఎంతకు కొలిక్కి రావడం లేకుండా పోయింది. పార్టీలో అంతర్గతంగా ఏ ఇద్దరు నాయకులు కలిసినా కొత్త సారధి ఎవరనే దానిపైనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే పలువురు నాయకుల పేర్లు తెరపైకి వస్తుండగా ..వాళ్ల ప్లస్‌లు, మైనస్‌లపై డిస్కషన్స్ జరుగుతున్నాయి. ఇదే సమయంలో బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ ఎవరైతే బాగుంటుందని అభిప్రాయ సేకరణ చేస్తుందట పార్టీ హైకమాండ్. కాస్త దూకుడుగా ఉంటూ, అందరిని కలుపుకుపోతూ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసే నేత కోసం సెర్చ్ చేస్తోందట కమలం పార్టీ అధిష్టానం. తెలంగాణ బీజేపీ చీఫ్‌గా సిట్టింగ్ ఎమ్మెల్యే లేదా ఎంపీని ఎంపిక చేయాలని ఆలోచన చేస్తున్నారట బీజేపీ పెద్దలు. అయితే ఎంపీగా ఉన్న నేతను అధ్యక్షుడిగా నియమిస్తేనే బెటర్ అనే భావనకు బీజేపీ హైకమాండ్ వచ్చిందట. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి రేసులో..ఎనిమిది ఎంపీల్లో ఐదుగురి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.

బండి సంజయ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు రేస్‌లో ఉన్నారన్నది బీజేపీ వర్గాల సమాచారం. ఈ ఐదుగురిలో ఎవరికి అధ్యక్ష పదవి కట్టబెట్టాలన్నదానిపై సీరియస్‌గా కసరత్తు చేస్తున్నారు హస్తిన పెద్దలు. అయితే ఫైనల్‌గా ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు పేర్లను ఢిల్లీ పెద్దలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలోని ఎవరి స్టాయిలో వారు లాబీయింగ్ నే అరవింద్, రఘునందన్ రావు..ఇద్దరు పార్టీ పెద్దలకు తమ మనసులోని మాట చెప్పుకుని ఎవరి స్టాయిలో వారు లాబీయింగ్ చేస్తున్నారట. అయితే పార్టీ అధిష్టానం మనసులో ఏముందోనన్న సస్పెన్స్ అంతకంతకూ పెరుగుతోంది. మరోవైపు బీసీ అజెండాతో ముందుకు వెళ్ళాలని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీ పెద్దలకు చెబుతున్నారట.కానీ, పొలిటికల్ సిచ్యువేషన్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటామని అధిష్టానం అంటోందట. దాంతో ఈ సారి రాజకీయ అవసరాల కోణంలో తెలంగాణ అధ్యక్ష ఎన్నిక ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. తెలంగాణలో పక్కాగా పొలిటికల్ అవసరాలు తీర్చేలా కొత్త అధ్యక్షుడి సెలక్షన్ ఉంటుందన్న ఢిల్లీ పెద్దలు ఇప్పటికే ఇండైరెక్ట్‌గా చెప్పేశారట. దీంతో ధర్మపురి అరవింద్, రఘునందన్ రావులలో ఎవరిని తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి వరిస్తుందోనన్న ఉత్కంఠ మాత్రం కంటిన్యూ అవుతోంది.

# మూసీ పనులు మళ్లీ ప్రారంభం

**హైదరాబాద్ :** మూసీ ప్రాజెక్టు ఊసే ఈ మధ్య కాలంలో వినిపించడం లేదు. మూసీ నది ప్రక్షాళన చేపట్టాలని భావించిన తెలంగాణ ప్రభుత్వం అందుకు అనుగుణంగా అడుగులు వేసింది. కొన్ని రోజులు జీహెచ్ఎంసీ అధికారులు హడావిడి చేశారు మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లకు నోటీసులు అందించారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లేను ఖాళీ చేయించారు. వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించి అక్కడకు తరలించగలిగింది. ఇక ప్రాజెక్టు ఊపందుకుంటుందన్న సమయంలో కొద్ది రోజుల నుంచి ఆ ప్రాజెక్టు గురించి ఇటు అధికారులు కానీ, ఇటు ప్రభుత్వం కానీ పట్టించుకోలేదు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకావడంతో పాటు పూర్తి స్థాయిలో ఒకేసారి మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివాసాలను తొలగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తుంది. సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభమవుతాయని తెలుస్తోంది. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇప్పటికే డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రభుత్వం కేటాయిస్తూ వస్తుంది. దీంతో కొత్త ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. పేదలయితే డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించడం ఇప్పటికే నిర్ణయం అయిపోయింది. దీనిపై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు. అలాగే కొన్ని ప్రాంతాల్లో సొంత భవనాలను నిర్మించుకుని ఏళ్ల తరబడి నివాసముంటున్నారు. వారికి అన్ని అనుమతులున్నాయి. అలాంటి వారిని అక్కడి నుంచి వారి అనుమతితోనే భవనాలను కూల్చి వేయాలన్న ఆలోచనతో రేవంత్ సర్కార్ ఉన్నట్లు అధికారిక సమాచారం. కొత్త ఏడాదిలో మూసీ నది పునరుజ్జీవం పనులు ప్రారంభం చేసేందుకు సిద్ధమయ్యారు ఇందుకోసం తొలి నాళ్లలో ప్రస్తుతముంటున్న భవనానికి సమీపంలోనే ప్రభుత్వ స్థలం ఉంటే రెండు వందల గజాల స్థలం ఇవ్వాలని నిర్ణయించారు. కానీ మరో ప్రతిపాదన కూడా తెరమీదకు వచ్చింది. మూసీ నిర్వాసితులకు అండగా ఉండేందుకు రేవంత్ ప్రభుత్వం సిద్ధమయింది. అందులో భాగంగా భూసేకరణ చట్టంప్రకారం పరిహారంతో పాటు బాధితుల కోసం 15వేల ఇళ్లను కేటాయించనుంది. దీంతో పాటు బాధితులు ఇల్లు కట్టుకునేందుకు అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ 150 గజాల స్థలం ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనతో వస్తే నిర్వాసితులు అంగీకారం తెలిపే అవకాశముందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. మొత్తం మీద మరికొన్ని రోజుల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూసీ ప్రాజెక్టును మళ్లీ యాక్టివ్ చేసి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న నివాస భవనాలను కూల్చివేసే ప్రక్రియను ప్రారంభిస్తారని తెలిసింది.

# రైల్వే ప్రయాణ వేళల్లో మార్పులు

**సికింద్రాబాద్** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి . ఈ మేరకు ట్రైన్ టైమింగ్స్, నెంబర్ల మార్పుపై సౌత్ సెంట్రల్ రైల్వే ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పులు జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. రైల్వే సర్వీసులను మరింత మెరుగుపరిచేందుకు, ప్రయాణికులకు బెస్ట్ సర్వీసెస్ అందించేందుకు ఈ మార్పులు చేసినట్లు పేర్కొంది.

దాదాపు 94 రైళ్ల టైమింగ్వస్ లో మార్పులు చేసింది. ఇందులో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన రత్నాచల్ ఎక్స్ప్రెస్ సైతం ఉంది. విజయవాడ స్టేషన్లో ఇక నుంచి 15 నిమిషాలు ముందుగానే రత్నాచల్ ఎక్స్ప్రెస్ బయలుదేరుతుంది. పాత షెడ్యూల్ ప్రకారం విజయవాడ రైల్వే స్టేషన్లో ఉదయం 6.15 గంటలకు బయలుదేరాల్సిన ట్రైన్, మార్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 6 గంటలకే బయలుదేరనుంది. నిత్యం విజయవాడ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులు భారీ సంఖ్యలో రత్నాచల్ ట్రైన్లో ప్రయాణిస్తుంటారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలంటూ దక్షిణ మధ్య రైల్వే సూచించింది. అదే విధంగా మరిన్ని ట్రైన్లలో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి.

# నేడు గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్



రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయంరానే వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా జనవరి 02 సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకుంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు.

ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియార అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.


# షూటింగ్ షురూ..

## ఎస్ఎస్ రాజమౌళి, మహేష్‌బాబు కాంబో భారీ సినిమా



సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే! ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతోంది అయితే. సినిమా సెట్స్ మీదకు ఎప్పుడు వెళుతుంది? అని ప్రేక్షకులంతా ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వాళ్లందరికీ గుడ్‌న్యూస్ అందింది. జనవరి 2వ తేదీ, గురువారం నాడు పూజా కార్యక్రమాలతో మహేష్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఉదయం పది గంటలకు ఓపెనింగ్ జరుగుతుంది. మామూలుగా తన సినిమా ప్రారంభోత్సవానికి మహేష్ బాబు హాజరు కారు. మరి ఈ సినిమాకు వస్తాడా లేదా అన్నది చూడాలి. ఈ కార్యక్రమానికి పరిశ్రమలో ప్రముఖులతోపాటు వంద మందికి పైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. 'ఆర్ఆర్ఆర్' సినిమా చిత్రీకరణలో కొంత భాగం అల్యూమినియం ఫ్యాక్టరీలోనే షూటింగ్ చేశారు. ఆ సమయంలోను రాజమౌళి ఆఫీస్ అక్కడే ఏర్పాటు చేశారు. బాహుబలి కోసం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ చేసినప్పుడు తన ఆఫీసును అక్కడే ఏర్పాటు చేశారు రాజమౌళి. ఇప్పుడు కూడా అంతే... అల్యూమినియం ఫ్యాక్టరీలో మహేష్ బాబు సినిమా షూటింగ్ కొంత చ్టేసలా ప్లాన్ చేస్తున్నారు. అందుకని ఆఫీస్ అక్కడ ఏర్పాటు చేశారు. సుమారు ఏడాదిగా అక్కడ ఈ సినిమా పనులు చేస్తున్నారని సన్నిహితుల నుంచి సమాచారం. ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఆఫ్రికాలో జరగనుంది. కొన్ని రోజుల క్రితం కెన్యా లోని అంబోసెలి నేషనల్ పార్క్ వెళ్లిన రాజమౌళి, లొకేషన్ రెక్కీ నిర్వహించి వచ్చారు. ఆయనతో పాటు తనయుడు ఎస్ఎస్ కార్తికేయ కూడా ఉన్నారు. ఇప్పుడు ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ ఆఫ్రికాలో ప్లాన్ చేస్తున్నారు. కెన్యాతోపాటు సౌత్ ఆఫ్రికాలోని కొన్ని లొకేషన్లలో కూడా షూటింగ్ చ్టేస అవకాశం ఉందని తెలిసింది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# 6న హరిహర వీరమల్లు పాట రిలీజ్



ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. జ్యోతి కృష్ణ ఈ భారీ యాక్షన్ ఎపిక్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అభిమానులు, ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపే వార్తను తాజాగా నిర్మాతలు పంచుకున్నారు. 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని జనవరి 6వ తేదీన ఉదయం 9:06 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్ ను వదిలారు. తుఫానుకి ముందు ప్రశాంతతలా, యుద్ధానికి ముందు చిరునవ్వు చిందిస్తూ ప్రశాంతంగా కనిపిస్తున్న యోధుడిలా ఉన్న పవన్ కళ్యాణ్ లుక్ పోస్టర్ లో ఆకట్టుకుంటోంది.

# పుట్టపర్తి సాయిబాబా సన్నిధిలో సాయి పల్లవి



కొత్త ఏడాది సందర్భంగా అందరూ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో మునిగితేలుతుంటే సాయి పల్లవి మాత్రం ఆధ్యాత్మికం వైపు వెళ్లింది. కొత్త సంవత్సరం కానుకగా.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబాను దర్శించుకుంది సాయి పల్లవి. కుటుంబంతో కలిసి పుట్టపర్తికి వెళ్లిన సాయిపల్లవి ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం బాబా నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మికతను చాటుకుంది. ఈ సందర్భంగా పట్టుచీరలో సంప్రదాయంగా మెరిసి ఆకట్టుకుంది. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ముద్దులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన సోనాక్షి దంపతులు



బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా దంపతులు 2025 సంవత్సరానికి వినూత్న రీతిలో స్వాగతం పలికారు. ముద్దుల్లో మునిగిపోతూ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన వీడియోను సోనాక్షి కపుల్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆ వీడియోలో సోనాక్షి సిన్హా అభిమానులను ఉద్దేశించి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు అని చెబుతూ కనిపిస్తుంది. ఆ తర్వాత తన భర్త జహీర్ ఇక్బాల్ చెంపపై ముద్దు పెట్టింది. ఈ సమయంలో వారి వెనుక న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి ఫైర్ క్రాకర్స్ పేలుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వేడుకలను వీక్షిస్తూ సోనాక్షి మరోసారి భర్త మెడపై ముద్దుపెట్టగా.. అందుకు స్పందనగా జహీర్ కూడా సోనాక్షి తల నిమురుతూ ముద్దులు పెట్టాడు. ఈ వీడియోను సోనాక్షి దంపతులు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. 'హమారా హ్యాపీ న్యూ ఇయర్ హొగయా.. హ్యాపీ న్యూ ఇయర్ ఫ్రమ్ సిడ్నీ అనే క్యాప్షన్ ఇచ్చారు.

# హృదయాన్ని కదిలించింది



'అమరన్' సినిమాపై ప్రశంసలు కురిపించింది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. ఈ ఏడాది తాను చూసిన అత్యుత్తమ చిత్రమిదేనని చెప్పింది. శివకార్తీకేయన్, సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్' చిత్రం దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథ ఆధారంగా స్ఫూర్తివంతంగా తెరకెక్కించారు. దేశభక్తి, ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఈ సినిమా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఇప్పటికే పలువురు సినీ తారలు ఈ సినిమా గొప్పతనాన్ని కొనియాడారు. తాజాగా ఆ వరుసలో జాన్వీకపూర్ చేరింది. ఈ సినిమా చూడటం చాలా ఆలస్యమైందని, ప్రతీ సన్నివేశం హృదయాన్ని కదిలించిందని, భావోద్వేగంతో కళ్లు చెమర్చాయని చెప్పింది. '2024లో నేను చూసిన గొప్ప సినిమా ఇదే. అదొక దృశ్యకావ్యం. ఇలాంటి మంచి సినిమాతో ఈ ఏడాదికి వీడ్కోలు చెప్పడం ఆనందంగా ఉంది' అని జాన్వీకపూర్ సోషల్‌మీడియాలో పేర్కొంది. 'దేవర' చిత్రంతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేసిన జాన్వీకపూర్ తొలిప్రయత్నంలోనే భారీ విజయాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం ఈ భామ రామ్‌చరణ్‌తో కలిసి గ్రామీణ క్రీడానేపథ్య చిత్రంలో నటిస్తున్నది. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ మొదలైంది.

# కొత్త సంవత్సరంలో అలరించనున్న సినిమాలు ఇవే..




కొత్త సంవత్సరం కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో వచ్చేసింది. అయితే 2024 ఏడాది సినిమా ప్రేక్షకులకు మంచి అనుభవాలను నింపి వెళ్లిన విషయం తెలిసిందే. గుంటూరు కారంతో మొదలైన కొత్త ఏడాది.. ఆ తర్వాత హన్ మాన్, కల్కి, సరిపోదా శనివారం, లక్కీ భాస్కర్, పుష్ప 2 ది రూల్ వంటి సినిమాలతో మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది. అయితే ఈ ఏడాది కూడా పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలు అలరించబోతున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో బాక్సాఫీసు ముందుకు రానున్న చిత్రాలేవో చూసేద్దాం. ఈ ఏడాది టాలీవుడ్‌లో తెలుగు సినిమా కాకుండా ఒక మలయాళం డబ్బింగ్ చిత్రం బోణీ కొడుతుంది. మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం మార్కో. హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. 5 రోజుల్లో రూ.50 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను తెలుగులో జనవరి 01న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు మేకర్స్. మలయాళ నటుడు టొవినో థామస్, సౌత్ క్వీన్ త్రిష ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం 'ఐడెంటిటీ'. అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. ఈ చిత్రం జనవరి 02న ప్రేక్షకుల ముందుకు రానుంది.

### గేమ్ ఛేంజర్

ప్రతి సంక్రాంతిలాగే ఈ సంక్రాంతి కూడా రసవత్తరంగా సాగబోతుంది. జనవరి 10న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో మొదలవ్వనున్న ఈ పోటీ తర్వాత వెంకటేశ్, బాలకృష్ణతో పాటు డబ్బింగ్ సినిమాలు రానున్నాయి. రామ్ చరణ్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

### 'డాకు మహారాజ్'

గేమ్ ఛేంజర్ వచ్చిన రెండు రోజులకే బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడానికి 'డాకు మహారాజ్' అంటూ వస్తున్నాడు బాలయ్య. బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న ఈ యాక్షన్ డ్రామాలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటిస్తుండగా.. 'వాల్తేరు వీరయ్య' సినిమాతో 2023 సంక్రాంతికి హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

### సంక్రాంతికి వస్తున్నాం

సంక్రాంతి రేసులో ఉన్న మరో పెద్ద సినిమా సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేశ్‌కి ఎఫ్2, ఎఫ్ 3 వంటి సూపర్ హిట్లు అందించిన దర్శకుడు అనిల్ రావిపుడి మరోసారి జతకట్టిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇవే కాకుండా హిందీ నుంచి కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' సినిమాని జనవరి 17న తీసుకురాబోతుండగా.. సోనూసూద్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న 'ఫతేహ్' జనవరి 10న రిలీజ్ కానుంది.

# కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిసిన సినీ ప్రముఖులు



కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ టాలీవుడ్ అగ్ర నటులు సోషల్ మీడియా వేదికగా అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు.మెగాస్టార్ చిరంజీవి కొత్త ఏడాది సందర్భంగా.. 2024కి వీడ్కోలు చెబుతూ.. 2025కి స్వాగతం.. ఈ కొత్త సంవత్సరం మరింత ప్రకాశవంతంగా విస్తరించాలని, కొత్త ఆశలు, ఆకాంక్షలు సాకారం చేసుకునే శక్తిని అందివ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భారతీయ సినిమా వైభవం మరింత ప్రకాశవంతంగా విస్తరించాలి. కొత్త సంవత్సరమంతా ప్రేమతో కలిసిమెలిసి ఉంటూ అందరితో ఆనందాన్ని పంచుకోవాలని కోట్లాదిమంది అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రెగొరియన్ క్యాలెండర్ ప్రకారం మొదలవుతోన్న నూతన సంవత్సరం సందర్భంగా ప్రతిఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నటుడు పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చాడు. పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ.. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నా అభిమానులందరికీ హ్యాపీ న్యూ ఇయర్. లవ్ యూ ఆల్ అంటూ రాసుకొచ్చాడు. నూతన సంవత్సర శుభాకాంక్షలు.. ఈ ఏడాది మరింత ఆనందాన్ని, విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు.

# సీఎంఆర్ కళాశాల గర్ల్స్ హాస్టల్ వద్ద ఉద్రిక్తత

- విద్యార్థినిలు బాత్రూంలో ఉండగా వీడియో తీశారంటూ ఆందోళన
- విద్యార్థి సంఘాలు గర్ల్స్ హాస్టల్ ముందు బైఠాయింపు
- 500 మంది విద్యార్థులతో ఆందోళన
- కళాశాలకు వ్యతిరేకంగా నినాదాలు
- సెక్యూరిటీ రూమ్ ను ధ్వంసం చేసిన విద్యార్థులు







**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మండలంలోని కండ్లకోయ గ్రామంలో గల సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఐటీ విద్యార్థినిలు బాత్రూంలో ఉండగా ఆ కళాశాల చెందిన సిబ్బంది ఒకరు వీడియో తీశారంటూ విద్యార్థి సంఘాల నేతలు, ఆ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఆందోళనకు దిగారు. కళాశాల గర్ల్స్ హాస్టల్ ముందు బైఠాయించి కళాశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు 500 మంది విద్యార్థులు ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కళాశాల యాజమాన్యం రావాలి అంటూ ఎన్.ఎస్.యూ.ఐ, ఏబీవీపీ నాయకులతో పాటు విద్యార్థులు, విద్యార్థినిలు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతమంత దద్దరిల్లింది. హాస్టల్ సెక్యూరిటీ గదిలోకి చొరబడి సెక్యూరిటీ గదిని ధ్వంసం చేశారు. చివరకు మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని శాంతింపజేశారు. నలుగురు అనుమానితులను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎన్.ఎస్.యూ.ఐ, ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ సీఎంఆర్ కళాశాలలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, హాస్టల్ గదిలోని బాత్రూంలో స్నానం చేస్తుండగా సీఎంఆర్ కళాశాలకు చెందిన (బీహార్ రాష్ట్రానికి) సిబ్బంది వీడియో తీయడం ఏంటి అంటూ ప్రశ్నించారు. రూ.లక్షల్లో ఫీజులు తీసుకుంటూ విద్యార్థినులకు రక్షణ కల్పించకపోవడం శోచనీయమని, ఈ సంఘటనకు బాధ్యులైన సిబ్బందిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# 51 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

- మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)నూతన సంవత్సరం సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో 51 కేసులు నమోదు అయినట్లు ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ను నిర్వహించారు. మేడ్చల్ పట్టణం లోని వివేకానంద విగ్రహం వద్ద, సీఎంఆర్ కాలేజ్, షామీర్పేట్ లోని ఓఆర్ఆర్ రోటరీ 2, తూముకుంట ప్రాంతాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కింద 51 కేసులు నమోదయాయని సిఐ హనుమాన్ గౌడ్ తెలిపారు. మందు తాగి పట్టుపడితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించినప్పటికీ పీకలదాకా మందు తాగి పోలీసులకు పట్టుబడి కటకటాలు లెక్కించే పరిస్థితిని మందుబాబులు కొని తెచ్చుకున్నారు.

## హైదరాబాద్ వ్యాప్తంగా ఏకంగా

# 1184 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్ లో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి.మరోవైపు పోలీసులు మాత్రం.. మందుబాబుల ఆట కట్టించారు. చాలాచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. హైదరాబాద్ వ్యాప్తంగా ఏకంగా 1184 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. రాచకొండ పరిధిలో 619 కేసులు నమోదయ్యాయి.హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కమిషనరేట్ పరిధిలో చూస్తే ఏకంగా 1,184 కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్ జోన్‌లో అత్యధికంగా 236 కేసులు నమోదయ్యాయి.ఇక రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు . మందు సేవించి వాహనం నడిపిన అనేక మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 619 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. మల్కాజ్‌గిరి డివిజన్‌లో 230 కేసులు అత్యధికంగా నమోదయ్యాయి.న్యూ ఇయర్ వేడుకల వేళ డ్రంక్ డ్రైవ్ టెస్టుల్లో మందుబాబులు ట్రాఫిక్ పోలీసులకు చుక్కలు చూపించారు. కొందరు పారిపోయేందుకు యత్నించగా.. మరికొందరు టెస్టులకు నిరాకరిస్తూ గొడవకు దిగారు.పంజాగుట్టలో పట్టుబడిన ఓ యువకుడికి టెస్ట్ చేయగా? ఏకంగా 550 పాయింట్లు చూయించింది. పోలీసుల తనిఖీలను చూసిన మందుబాబులు వాహనాలను వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. ఇక హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే కాకుండా అన్ని జిల్లాల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. రోడ్లపై ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపట్టారు. వరంగల్ ట్రై సిటీ పరిధిలో పోలీసుల గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనేక చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. రికార్డు స్థాయిలో 330కి పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రిజిస్టర్ చేశారు.

### రీడింగ్ 550 పాయింట్స్

పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో ఓ వ్యక్తికి నిర్వహించిన టెస్ట్‌లో రీడింగ్ 550 పాయింట్స్ చూపించింది. అంటే అతను ఏ స్థాయిలో తాగాడో మనకు అర్థం అవుతుంది. నాంపల్లిలో కొందరు ఆటోవాలాలు హంగామా సృష్టించారు. ఫుల్‌గా తాగి రోడ్లపై హల్‌చల్ చేశారు. రోడ్డుపై వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేశారు. బహదూర్‌పురాలో ఓ మందుబాబు వీరంగం సృష్టించాడు. తన బైక్ ఇవ్వాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. అటు మీర్‌చౌక్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించిన పోలీసులు.. మందు తాగి దొరికిన వారి వాహనాలు సీజ్ చేశారు. కొందరు మద్యం మత్తులో పోలీసులపై తిరగబడ్డారు.

హయత్‌నగర్‌లో జరిగిన న్యూఇయర్ వేడుకల్లో రెండు వర్గాలుగా విడిపోయి తన్నుకున్నారు యువకులు. మరోవైపు నగరవ్యాప్తంగా అన్ని చోట్ల తనిఖీలు నిర్వహించారు పోలీసులు. మద్యం సేవించి రోడ్డెక్కిన మందుబాబులు.. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌కు నిరాకరించిన ఓ మందుబాబు పరుగుల తీశాడు. అతన్ని వెంటపడి పట్టుకున్నారు పోలీసులు.

# ఉద్యోగాల భర్తీకి 'జాబ్ క్యాలెండర్'

ఉద్యోగ అభ్యర్థులకు శుభవార్త చెప్పేందుకు ఏపీ సర్కార్ సిద్ధమవుతోంది. 'జాబ్ క్యాలెండర్'ను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టింది. ఏపీపీఎస్సీ ద్వారా వివరాలను ప్రకటించాలని యోచిస్తోంది. ఇందుకు ఈనెల 12వ తేదీని ముహూర్తంగా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఏపీలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టింది. నిర్దిష్ట సమయంలో ఖాళీలను పూరించేలా కసరత్తు చేస్తోంది. ఇదే సమయంలో ముందస్తుగానే ఖాళీలను గుర్తించి రిక్రూట్ చేసేలా జాబ్ క్యాలెండర్ ను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. ఏపీ ప్రభుత్వం విడుదల చేసే జాబ్ క్యాలెండర్ ను ఏపీపీఎస్సీ ద్వారా ప్రకటించనుంది. అయితే ఇందుకు జనవరి 12వ తేదీని ముహూర్తంగా ఫిక్స్ చేసినట్లు తెలిసింది. అంతకంటేముందే ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉంది.జనవరి 12వ తేదీనే కొత్త నోటిఫికేషన్లను జారీ చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా? నోటిఫికేషన్ జారీ అయిన వాటి పరీక్ష తేదీలను కూడా ప్రకటించనున్నారు. దాదాపు 18 - 20 ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు సమాచారం. కొత్తగా జారీ చేయబోయే నోటిఫికేషన్ల ద్వారా 850కిపైగా పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. అయితే వీటిలో అత్యధికంగా ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ లో ఉన్నాయి. ఇక ఏప్రిల్ తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను కూడా నిర్వహించనున్నారు.ఆయా శాఖాల్లో ఖాళీల వివరాలను ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతులు రాగానే? జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈనెలలో ప్రకటించే జాబ్ క్యాలెండర్ కు అనుగుణంగా? వెంటనే నోటిఫికేషన్లు ఇచ్చి రాత పరీక్ష తేదీలను కూడా ఖరారు చేయనున్నారు. అయితే ఈ ఏడాది మార్చి నుంచి రాత పరీక్షల తేదీలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. జాబ్ క్యాలెండర్ విడుదలకు కసరత్తు చేస్తున్న ఏపీ ప్రభుత్వం? ఈ వారం రోజుల్లోనే వివరాలను ప్రకటించనుంది. ఆ తర్వాత ఏపీపీఎస్సీ ద్వారా అధికారికంగా జాబ్ క్యాలెండర్ ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# కేటీఆర్, మల్లారెడ్డి లను కలిసిన భాస్కర్ యాదవ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి లను బుధవారం మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, మేడ్చల్ బిఆర్ఎస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్ లో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మాజీ అధ్యక్షుడు రాజు(శ్రీనివాస్ ) , కౌన్సిలర్ తుడుం గణేష్, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చీకటి కార్తీక్



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చీకటి కార్తీక్ గెలుపొందారు. భద్రాద్రి కొత్తగూడెం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు వెన్నుదన్నుగా ఓట్లు వేసి గెలిపించిన యువతకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు, స్నేహితలకు, హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా యువతకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేందుకు ప్రయత్నిస్తామని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సామాన్యుడి సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చీకటి కార్తీక్ తెలిపారు.

# వేవ్స్ 2025 అసలైన గేమ్ ఛేంజర్

ప్రధాని నరేంద్రమోదీ ఈ ఏడాది చివరి మన్ కీ బాత్ కార్యక్రమంలో ఫిబ్రవరి 5 నుంచి ఫిబ్రవరి 9 వరకు భారతదేశం మొదటిసారిగా ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ 2025 (వేవ్స్)ను నిర్వహిస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మోదీ ప్రకటన పై బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. వేవ్స్ సమ్మిట్ కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ ట్వీట్ చేశారు. "భారతీయ ఆర్థిక వ్యవస్థలో అది పోషిస్తున్న పాత్రను అలాగే సాఫ్ట్ పవర్‌గా దాని బలాన్ని గుర్తిస్తుంది. మన దేశంలోనే జరగనున్న వేవ్స్ ? ఫిల్మ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వరల్డ్ సమ్మిట్ కోసం నేను ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. మా పరిశ్రమను జరుపుకునే సందర్భం అన్నింటికంటే, ఛాంపియన్‌లు, సృజనాత్మకతను పెంపొందించే సందర్భం" అంటూ ట్వీట్ చేశారు షారుఖ్.అంతకు ముందు ప్రధాని మోదీ వేవ్స్ ప్రకటనపై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సైతం సంతోషం వ్యక్తం చేశారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. మీడియా, ఎంటర్టైన్మెంట్ రంగాలను ప్రోత్సహించడం ఆనందంగా ఉంది. చిత్ర పరిశ్రమ సహకారానికి వేవ్స్ 2025 అసలైన గేమ్ ఛేంజర్ కానుంది" అని పేర్కొన్నారు.ప్రధాని మోదీ ఈ ఏడాది చివరి 'మన్ కీ బాత్ కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావుపై ప్రశంసల జల్లులు కురిపించిన సంగతి తెలిసిందే. తెలుగు సినిమాకు ఏఎన్నార్ చేసిన కృషిని కొనియాడారు. తన సినిమాలలో భారతీయ సంప్రదాయాలు, విలువలకు తగిన స్థానం కల్పించి టాలీవుడ్ ను మరో స్థాయికి తీసుకెళ్లారని ప్రశంసించారు.

మానవతా విలువలను కూడా ఆయన చాటారని అన్నారు భారతీయ చలనచిత్ర రంగం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని అన్నారు. భారత్ నుంచి అద్భుతమైన సినిమాలు వస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా మన సినిమాలు రికార్డులను సృష్టించడంతో పాటు అవార్డులు దక్కించుకుంటున్నాయని అన్నారు. వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను తొలిసారిగా మన దేశంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మీడియా, వినోద పరిశ్రమకు చెందిన ప్రపంచ దేశాల దిగ్గజాలు పాల్గొంటారని మోదీ పేర్కొన్నారు. ప్రధాని తన ప్రసంగంలో తెలుగుతో సహా పలు భాషలకు చెందిన సినీరంగ ప్రముఖుల పేర్లను ప్రస్తావించారు. జనవరి 13 నుంచి ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమయ్యే కుంభమేళాను ఐక్యతా మేళాగా పేర్కొన్నారు మోదీ.

# సీఎంఆర్ఎఫ్

## - 1600 మంది బాధితులకు రూ. 24 కోట్లు..!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2025 నూతన సంవత్సరం ఓ ప్రత్యేక శుభారంభంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన సంవత్సరంలో తన తొలి సంతకాన్ని ప్రజల ప్రయోజనానికి అంకితమిచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిధుల విడుదలకు సంబంధించిన ఫైలుపై సంతకం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పేద వర్గాలకు సాయం అందించడానికి తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని మరోసారి తెలిపారు.ముఖ్యమంత్రి నూతన సంవత్సర తొలి సంతకంతో 1,600 మంది దరఖాస్తుదారులకు రూ. 24 కోట్ల మేర నిధులు విడుదల అయ్యాయి. గత ఏడాది డిసెంబర్ 31 వరకు ప్రభుత్వం రూ. 100 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు విడుదల చేసింది. దీంతో 7,523 మంది పేద వర్గాలకు లబ్ది చేకూరింది. తాజాగా విడుదల చేసిన సీఎంఆర్ఎఫ్ నిధుల మొత్తం రూ. 124.16 కోట్లకు చేరింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ది పొందిన వారి సంఖ్య 9,123 గా నమోదైంది.సీఎంఆర్ఎఫ్ ద్వారా రాష్ట్రంలో ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలకు పలు అవసరాలు నెరవేర్చడానికి సాయం అందిస్తున్నారు.1. ఆరోగ్య చికిత్సల కోసం అత్యవసర ఆర్థిక సాయం.

2. పేద కుటుంబాలకు తక్షణ సహాయం.

3. ఇతర అత్యవసర అవసరాలకు నిధుల అందుబాటు.

ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలోనూ సీఎంఆర్ఎఫ్ ప్రాధాన్యతను సూచిస్తూ పేదవర్గాలకు మద్దతుగా నిలిచినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ముఖ్యమంత్రి నూతన సంవత్సర తొలి సంతకంతో ప్రజలకు మరోసారి సంక్షేమ ప్రభుత్వం భావాన్ని పునరుద్ఘాటించారు. సీఎంఆర్ఎఫ్ కింద గత ఏడాది నుంచే పేదలకు తక్షణ పరిష్కారాలు అందించడంలో ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోందనీ ముఖ్యమంత్రి కార్యాలయం వివరించింది.ప్రతీ దరఖాస్తును పరిశీలించి ప్రాధాన్యతా ప్రమాణాలతో వెంటనే నిధులు విడుదల చేయడం ముఖ్యమంత్రి కార్యాలయం పని తీరు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. 2025 నూతన సంవత్సరంలో ప్రభుత్వం ప్రజల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. సీఎంఆర్ఎఫ్, ఇతర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదవర్గాల జీవితాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ ధ్యేయం అని,ఈ చర్యలతో రాష్ట్రంలో సంక్షేమానికి, సేవలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో మెరుగైన మార్గదర్శకత్వం చూపించారని కూటమి నేతలు ప్రశంసిస్తూ ఉన్నారు.

# యువజన కాంగ్రెస్ ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి**

**జిల్లా ఐవైసీ అధ్యక్షులు కార్తీక్ కు ఘన సన్మానం**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) యువజన కాంగ్రెస్ విభాగాన్ని జిల్లాలో మరింత పటిష్టంగా చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి అన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్ ను జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆళ్ళ మురళి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇప్పటి చాలా మంది జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు ఒక్కప్పుడూ యువజన కాంగ్రెస్ లో పనిచేసిన వారేనని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ధ్యేయంగా యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. నాగేంద్ర త్రివేది, కేకే శ్రీను, బాలిశెట్టి సుందర్ రాజు, మసూద్, సుందర్ లాల్ కోరి, బాల పాసి, వాణి రెడ్డి, సత్తి రెడ్డి, వెంకటేశ్వర్లు, సాయి, కూరపటి రాజేష్ తదితరులు ఉన్నారు.

# 16మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్వీస్ నుంచి తొలగింపు

ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన వారే పక్కదారి పట్టారు. విధులకు హాజరు కాకుండా డుమ్మా కొట్టారు. సమాధానం ఇవ్వాలంటూ పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. దీంతో చర్యలు చేపట్టిన విద్యాశాఖ 16మంది ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఏకంగా 16మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్.. కాదు.. కాదు.. సర్వీస్ నుంచి తొలగింపు.. షాకిచ్చిన సర్కార్..!సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయుల తీరుతో ఇటీవల విద్యా శాఖకే మాయని మచ్చలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 16 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సస్పెన్షన్ కాదు.. ఏకంగా సర్వీస్ నుంచి రిమూవ్ అయ్యారు. ఈ పెద్ద ఎత్తున టీచర్లను తొలగించడం తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఈ ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి ఎందుకు తొలగించారో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..!ఉపాధ్యాయులు అంటేనే సమాజంలో నానాటికి ప్రతిష్ట పాలవుతున్నారు. రోజు బడికి వెళ్లి పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు.. అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. 16 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలలకు రాకుండానే రాజభోగాలు అనుభవిస్తున్నారు. దీంతో విచారణ జరిపిన రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే స్కూల్ అసిస్టెంట్ గీతారాణి, ఎస్జీటీలు విజయలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, ఉమారాణి, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్ హమీద్, స్వప్న, మాధవి, నవీన్ కుమార్, ఎం. ఉమాదేవి, క్రాంతి కిరణ్, జె. ఉమాదేవి, నర్సింహారావు, శైలజ, భాగ్యలక్ష్మి, కిరణ్ కుమారి 2005 నుంచి 2022 వరకు అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. దీనిపై సమాధానం ఇవ్వాలంటూ ఐదు దఫాలుగా వీరికి నోటీసులు ఇచ్చినా స్పందించలేదుగైర్హాజరుపై సదరు ఉపాధ్యాయులు ఎలాంటి సమాధానం కూడా ఇవ్వలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి.. 16 మంది ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ దీర్ఘకాలికంగా గైరాజరైన 16 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ తెలిపారు.

# ఆటో బోల్తా..

## పదిమంది మహిళలకు గాయాలు

**రాజన్నసిరిసిల్ల** బోయినిపల్లి మండలం కొదురుపాక ఎక్స్ రోడ్డు వద్ద టాటా ఏస్ ఆటో..అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో పది మంది మహిళలకు గాయాలు అయ్యాయి. ఇద్దరు పరిస్థితి విషమంగా వుంది. వారందరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ట్రాలీ ఆటోలో 20 మంది మహిళలు వేములవాడ రాజన్న దర్శనం కోసం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వారంతా మహారాష్ట్ర కు చెందిన వలస కూలీలుగా గుర్తించారు. కరీంనగర్ లోని అల్గునూర్ లో ఉంటు వరి నాట్లు వేసే కూలీలు.

# మాజీ మంత్రి కృష్ణ యాదవ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) బిజెపి పార్టీ సీనియర్ నాయకులు మాజీమంత్రి సి. కృష్ణ యాదవ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన అంబర్ పేట నియోజకవర్గం బిజెపి నాయకులు దయాకర్ యాదవ్ ,రామచంద్రగుప్త, పెంటం రాజు, దడిగే జగన్ యాదవ్, మేడ్చల్ రాజు, శ్రీనివాస్, ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ అంబర్ పేట నియోజకవర్గం ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజా సమస్యల పై పోరాటానికి బీజేపీ పార్టీ ఎప్పుడు ముందుంటుందని ఈ సందర్భంగా అన్నారు.

# కేసీఆర్ గేరు మారుస్తాడా.?

## - కొత్త ఏడాదయినా కనిపిస్తాడా? మురిపిస్తాడా?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ అధినేత గత ఏడాది ఎక్కడా కనిపించలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రచారానికి వచ్చారు. అన్ని జిల్లాల్లో పర్యటించారు. అయితే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ సాధించలేకపోయింది. దీంతో కేసీఆర్ నాటి నుంచి ఎర్రవెల్లి లోని ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. ఎవరైనా ఆయనను కలవాలనుకున్నాఅక్కడకు వెళ్లాల్సిందే తప్ప ఆయన బయటకు రావడం లేదు. ఇటీవల మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించినా ఫాం హౌస్ నుంచి ఒక సంతాప ప్రకటన అయితే పంపారు తప్ప ఆయన మాత్రం బయటకు రాలేదు. నిజానికి మన్మోహన్ సింగ్ తో ఉన్నఅనుబంధంతో ఆయన ఢిల్లీకి వెళ్లి నివాళులర్పించాల్సిన తరుణంలో ఫాం హౌస్ కే పరిమితమయ్యారు.

### - అసెంబ్లీ సమావేశాలకు..

మరొకవైపు అసెంబ్లీ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. బడ్జెట్ సమావేశాలకు రాలేదు. సరే ఇటీవల మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపేందుకు ప్రత్యేకంగా సమావేశమైన సభకు కూడా కేసీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. తనకు మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధం ఆయన తన నోటి నుంచి చెప్పి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అందరిలో ఉన్నా దూరంగానే ఉన్నారు. ఇక తెలంగాణలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఆయనపై ఇటు ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతుంది. మరోవైపు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు.

### - కేటీఆర్ కు నోటీసులు ఇచ్చినా..

ఈడీ అధికారులు అయితే ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఏసీబీ అధికారులు కూడా ఈ కేసులో విచారించే అవకాశాలున్నాయి. అంతే కాదు అరెస్ట్ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అంతా తానే అయి ఇన్ని రోజులు కార్యకర్తలకు భరోసాగా ఉన్న కేటీఆర్ కు నోటీసులు వచ్చిన సమయంలోనైనా కేసీఆర్ బయటకు రాకపోవడం గులాబీ పార్టీలో చర్చనీయాంశమైంది. అసలు కేసీఆర్ కు జనంలో తిరిగే ఆలోచన ఉందా? లేదా? అన్నది కూడా పార్టీలో తెలియకుండా ఉంది. కేసీఆర్ బయటకు వచ్చి జనంలో తిరిగితే కార్యకర్తలకు కూడా ధైర్యం కలుగుతుందని తెలిసినా ఫాం హౌస్ కే పరిమితమవ్వడమేంటన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది.

### - కేసులు పెడుతున్నా..

ఎర్రవెల్లి ఫాం హౌస్ లో కేసీఆర్ కేవలం వ్యవసాయ పనులు చూసుకుంటూ గడిపేస్తున్నారు. కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపేందుకు కూడా అక్కడకు నేతలకు వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని, రైతులకు ఇంత వరకూ భరోసా అందలేదని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ సమయంలో కేసీఆర్ వచ్చి కనీసం మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇటు ప్రజల్లోనూ , అటు కార్యకర్తల్లోనూ ధైర్యం కలుగుతుందని, కానీ కనీసం ఆ పని కూడా చేయకపోతే ఎలా? అన్న ప్రశ్నలు గులాబీ పార్టీ నుంచి వినపడుతున్నాయి. అనేక మంది పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నా కేసీఆర్ బయటకు రాకపోవడంపై పార్టీలోనే ఒకింత నిరాశ నిస్పృహలు బయలుదేరాయి.

# పాలనలో 2025 గేమ్ ఛేంజర్ కావాలి

## - పలు శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు






**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వంలోని ఆయా శాఖల్లోని కీలక అధికారులతో సిఎం చంద్రబాబు నాయుడు కొత్త సంవత్సరం సందర్భంగా ముచ్చటించారు. రోజువారీ సమీక్షలకు భిన్నంగా అధికారులతో మాటామంతీ జరిపారు. తన ఆలోచనలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలు వివరించిన సిఎం అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిఎస్, డీజీపీ, సిఎంవో అధికారులుసహా వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు ఈ భేటీకి హాజరయ్యారు.

### - కొత్త ఉత్సాహంతో పని చేద్దాం: చంద్రబాబు

కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అంటూ అధికారులను ప్రోత్సహించారు చంద్రబాబు. మనమంతా ఒక టీం, కలిసి పనిచేద్దాం ప్రజల జీవితాలు మారుద్దాం అని వారికి పిలుపునిచ్చారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని సూచించారు. ఒక పాజిటివ్ ఎనర్జీతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సిఎం చంద్రబాబు అన్నారు. వివిధ ప్రభుత్వ పాలసీలకు సంబంధించి తన అనుభవాలను గుర్తుచేసి వారిలో ఉత్సాహం నింపారు. 2025 సంవత్సరం లక్ష్యాలు ఏంటి, పనితీరు ఎలా ఉండాలనేది వివరించారు. ప్రతి శాఖ రిజల్ట్ ఓరియంటెడ్‌గా పని చేయాలన్నారు.

### - విమర్శలు వచ్చినా ముందుకెళ్లా: చంద్రబాబు

ఇంకా చంద్రబాబు మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో సంస్కరణలు అంటే పేదలకు వ్యతిరేకం అనే ప్రచారం ఉండేది. కానీ నాడు ధైర్యంగా సంస్కరణలు అమలు చేశాం. వాజ్ పేయి ప్రధానిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కూడా సంస్కరణలు మొదలుపెట్టాం. నేషనల్ హైవేల విషయంలో నాడు తీసుకున్న నిర్ణయంతో స్వర్ణచతుర్భుజి రోడ్లు వచ్చాయి. ఓపెన్ స్కై పాలసీ వల్ల విమానయాన రంగంలో అనూహ్య మార్పులు వచ్చాయి. పిపిపి విధానం వల్ల సంపద సృష్టి జరిగింది. నాడు హైదరాబాద్‌లో చేసిన ప్రతి అభివృద్ధి నేడు అద్భుత ఫలితాలను ఇస్తోంది" అని సిఎం చంద్రబాబు అన్నారు. వివిధ నిర్ణయాల తీసుకునే సమయంలో ఎదుర్కొన్న విమర్శలను కూడా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అయినా మంచి సంకల్పంతో తీసుకున్న నిర్ణయాల వల్ల ఫలితాలు వచ్చాయని అన్నారు.

### - కంటిన్యూ అయి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది: చంద్రబాబు

విభజన తర్వాత ఏపిలో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. "2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే రాష్ట్రం ఎంతో పురోగతి సాధించేది. రాష్ట్రాల అభివృద్ధిలో సుస్థిర ప్రభుత్వం అనేది కూడా ముఖ్యం. అప్పుడే అనుకున్న విధంగా ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ప్రజలకు మేలు జరుగుతుంది"అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. "2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగు లేని తీర్పు నిచ్చారు. ప్రభుత్వంపై అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. వీటిని నెరవేర్చే క్రమంలో అనేక నిర్ణయాలు తీసుకున్నాం. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలసీలు తెచ్చాం. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడులు వస్తున్నాయి. ఇది మంచి పరిణామం. మనకున్న పేరుతో, కొత్తపాలసీతో మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయి. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాం, ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాం. దీనికి అనుగుణంగా సమస్త అధికార యంత్రాంగం పనిచేయాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు.

### - ప్రతి ఇల్లు జియోట్యాగింగ్: చంద్రబాబు

"రాష్ట్రం ఉన్నపరిస్థితుల నేపథ్యంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. తొందరగా ఫలితాలు రాబట్టాలి. టెక్నాలజీ సాయంతో చాలా మంచి ఫలితాలు వస్తాయి. ప్రతి శాఖలో టెక్నాలజీ వాడకాన్ని పెంచాలి. రానున్న రోజుల్లో 150 సర్వీసులు వాట్సాప్ ద్వారా ఇవ్వనున్నాం. దీనికి సమాయత్తం కావాలి. ఆధార్‌ను సమర్థవంతంగా ఉపయోగిస్తాం. ప్రతి ఇల్లు జియో ట్యాగ్ చేస్తాం. పింఛన్లు ఇంటి వద్దనే ఇచ్చారా లేదా అనేది రియల్ టైంలో తెలిసిపోతుంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సిసి కెమెరాలు, డ్రోన్లు, రియల్ టైం డాటాను సమర్థవంతంగా వినియోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు.

### - స్మార్ట్ వర్క్ చేయండి: చంద్రబాబు

రెవెన్యూ శాఖలో చాలా సమస్యలున్నాయి. వీటన్నింటికి పరిష్కారం చూపాలి. రాత్రింబవళ్లు పనిచేయాల్సిన అవసరం లేదు. స్మార్ట్ వర్క్ చేయండి. టెక్నాలజీని వాడండి కచ్చితంగా ఫలితాలు వస్తాయి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు తెలిపారు. "ప్రజలకు 5 ఏళ్ల కాలంలో ఏం చేయాలి అని మాత్రమే కాదు భవిష్యత్ అవసరాలను గుర్తించి విజన్ 2047ను తీసువచ్చాం. ఇందులో పేర్కొన్న 10 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషిచేయాలి. అన్ని కార్యక్రమాలకు డబ్బుతోనే కాదు కొత్త ఆలోచనలతో కొత్త మార్గాల్లో ప్రయాణం చేయాలి. మంచి చేయాలనే తపన, ఆలోచన ఉంటే చాలా అంశాల్లో ప్రజలకు మేలు చేయవచ్చు. 2025 సంవత్సరం ఆ తరహా ఆలోచనలకు వేదిక కావాలని కోరుకుంటున్నా. 2025 గేమ్ చేంజర్‌లో కీలకం కావాలి. అతిపెద్ద మార్పుకు ఈ ఏడాదిలో నాంది పడాలి" అని సిఎం అన్నారు.

### - అన్నింటికీ డబ్బుతో పరిష్కారం చూపలేం: చంద్రబాబు

"రూ. 80 వేల కోట్లతో గోదావరి నీళ్లు బనకచర్లకు సాధ్యమా అని అడుగుతున్నారు. అర్థికంగా అతి పెద్ద ప్రాజెక్ట్.. అయినా సరే దీన్ని చేపట్టాలి. ఇది రాష్ట్ర దశ దిశ మారుస్తుంది. ఇప్పుడు చేపట్టకపోతే ఈ ప్రాజెక్టును ఇక ఎప్పటికీ చేపట్టలేం. ఇవన్నీ ప్రజల జీవితాల్లో నేరుగా మార్పులు తెచ్చే కార్యక్రమాలు "అని సిఎం అన్నారు. "నేను మీ నుంచి వినూత్న ఆలోచనలు కోరుకుంటున్నా. 1995లో మా దగ్గర డబ్బు లేదు. కానీ ఆలోచనలతో మార్పు తెచ్చాం. అధికారులు సరికొత్త ఆలోచనలతో పనిచేస్తే ఫలితాలు వస్తాయి. కలిసి సమిష్టిగా, వేగంగా అడుగులు వేద్దాం. మనం ఎంత వేగంగా, సమర్థవంతంగా పనిచేస్తే అంత త్వరగా ఫలితాలు వస్తాయి "అని సిఎం అన్నారు.

### - అధికారుల సూచనలకు ఓకే

ఈ సందర్భంగా పాలనా అంశాలపై అధికారులు కొందరు తమ అభిప్రాయాలు చెప్పారు. అతి పెద్ద పెట్టుబడులు పెట్టే సంస్థల కార్యకలాపాలు వేగంగా కార్యరూపం దాల్చడం కోసం ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. ఈ సూచనను సిఎం స్వాగతించారు. ఆయా శాఖలకు సంబంధం ఉన్న పెద్ద పెద్ద సంస్థలు సిఎస్ఆర్ కోసం నిధులు ఖర్చు చేస్తాయని వాటిని ఒక గొడుగు కిందకు తెచ్చి మంచి ఫలితాలు వచ్చేలా వాటిని ఖర్చు చేసేలా చూడాలని సూచించారు. దీనికి కూడా సిఎం అంగీకారం తెలిపారు. 2025 మార్పునకు, వేగానికి, పాలనను కొత్త పుంతలు తొక్కించడానికి, ప్రజల సంతృప్తిని పెంచడానికి వేదిక కావాలని ఆ దిశగ అన్ని స్థాయిల్లో సిబ్బంది, అధికారులు, పనిచేయాలని సిఎం కోరారు.

## గత సంవత్సరం ధర్పల్లి మండలానికి

# వెయి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్రాజ్. సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేసి అనంతరం మాట్లాడుతూ 2024 సంవత్సరాన్ని ముగించుకొని 2025 సంవత్సరంకు అడుగుపెట్టిన శుభ సందర్భంలో ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి లా ఆదేశాల మేరకు 15 చెక్కులను ధర్పల్లి, హొన్నజి పేట్, దమ్మన్నపేట్, చల్లగరిగే గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు అందించడం జరిగింది. పోయిన సంవత్సరం ధర్పల్లి మండలానికి 1000 చెక్కులు పంపిణీ చేసి మనసున్న మారాజు అనిపించుకున్న మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మన ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ధర్పల్లి మండల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్రాజ్, సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, వీడిసి చైర్మన్ గుండయ్య,వై జి ఆర్, ఎలాల గంగారెడ్డి,చెలిమెల శ్రీనివాస్, అబ్దుల్ మజీద్, పోతరాజు, సురేందర్ గౌడ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# పుట్టినరోజునే మర్చిపోయి ప్రజసేవ చేస్తున్న ధర్పల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజ్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ కార్యకర్తలు. తన కార్యనిర్వాహణ లో భాగంగా పుట్టినరోజునే మర్చిపోయి పనిచేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులకు కార్యకర్తలు గుర్తించి సర్ప్రైజ్ ఇవ్వాలని కేక్ తీసుకెళ్లి అన్నా పుట్టినరోజు శుభాకాంక్షలు అని తెలియజేశారు.ఈ సందర్భంగా అ యువకులు మాట్లాడుతూ పార్టీ కష్టకాలం ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి అన్ని సమయల లో నేనున్నానంటు ప్రతి కార్యకర్తకు ధైర్యం ఇచ్చి ముందుకు వచ్చి నిలిచిన వ్యక్తి మ అన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్రాజ్ అన్న కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అంటూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు. ఈ కార్యక్రమంలో ఎలలా గంగారెడ్డి ఎట్క జి ఆర్, చెలిమెల శ్రీనివాస్, విలేజ్ కమిటీ అధ్యక్షుడు కుమ్మరి గుండయ్య, సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పోతరాజు, సురేందర్ గౌడ్, సురేష్, అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మెదక్ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఆంగ్ల నూతన సంవత్సర సందర్భంగా నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో పూలమాలతో ఘనంగా సత్కరించి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన మెదక్ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరంలో నర్సాపూర్ నియోజకవర్గ పాటు ప్రజలందరికీ వారి ఆకాంక్షలు ఆశయాలు నేరే విధంగా భగవంతుడు శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని వారు కోరుకున్నట్లు వారు తెలియజేశారు నూతన సంవత్సర దినాన వారి వారి కుల మతాలకు చెందిన ఇష్టదైవాలను దర్శించి లేదా ప్రార్థించి కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో ఆనందంగా గడపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మరియు మెదక్ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి తెలిపారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎల్లం, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ప్రసాదాన్ని ఎమ్మెల్యే సునీత రెడ్డికి అందజేసిన

## ఘనపూర్ పిఏసిఎస్ వైస్ చైర్మన్ రాజా గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామ సొసైటీ వైస్ చైర్మన్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వారికి అయ్యప్ప ప్రసాదాన్ని మరియు అయ్యప్ప క్యాలెండర్ ను అందజేసిన వైస్ చైర్మన్ రాజా గౌడ్ ఈ సందర్భంగా రాజా గౌడ్ మాట్లాడుతూ ఆంగ్ల నూతన సంవత్సర సందర్భంగా మరియు అయ్యప్ప ఆశీస్సులతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయంలో ఆలయ అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి దుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని పిఏసిఎస్ వైస్ చైర్మన్ రాజా గౌడ్ కోరుకున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఘనపూర్ సొసైటీ డైరెక్టర్లు పుల్లబోయిన మల్లేశం , సోమ నర్సింలు , తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం

## - అమిత్ షా పార్లమెంటరీ సభ్యత్వం రద్దు చేయాలని సిపిఎం డిమాండ్




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పార్లమెంటరీ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు అమితాషా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి ఏం నరేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి అని భారతదేశ రూపురేఖలను మార్చినటువంటి మహా వ్యక్తి అని, అలాంటి వ్యక్తి పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం అనేది దుర్మార్గమని ఆరోపించారు.బిజెపి తన నిజ స్వరూపాన్ని ఈ సందర్భంలో బయటపెట్టుకుందని,ఇప్పటికైనా అనగారిన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరూ కలిసి బిజెపికి, ఆర్ఎస్ఎస్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి పి ఏం మండల కమిటీ సభ్యులు ప్రశాంత్, నర్సింగ్ రావ్, కొమురయ్య, పార్టీ సభ్యులు లాత, చంద్రశేఖర్, కే.నర్సింగ్ రావ్,నర్సింహా, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు

# ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారం

- రంగురంగుల బ్యానర్లతో కస్టమర్లకు అట్రాక్షన్
- నాణ్యతలేని భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు
- తింటే.. రోగాలు కొనితెచ్చుకున్నట్లే
- బయటఫుడ్ తినేందుకు జంకుతున్న జనం
- నిల్వ ఉన్న ఆహారం తిని, ఫుడ్ పాయిజన్ తో ఆస్పత్రుల పాలు
- రోజుల తరబడి ఫ్రిజ్లలో మాంసం నిల్వలు
- రోగాలతో చనిపోయిన జంతు మాంసంతో వంటకాలు.?
- క్వాలిటీ లేని నూనెలు.. పట్టించుకోని అధికారులు
- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు మరిచిపోయారని ప్రజల ఆవేదన



"కాలం వేగంగా పరుగెడుతుంది.. మనిషి కూడా కాలంతో అంతే వేంగంగా పరుగెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించడమే మరిచిపోతున్నాడు. కొన్నిసార్లు ఇంట్లో అన్నం తినేందుకు కూడా సమయం దొరకనంతగా బిజీబిజీగా గడుపుతున్నాడు. దీంతో బయట ఆహారం తీసుకునేవారి సంఖ్య పట్టణాలతో పాటు పల్లెల్లోనూ పెరిగిపోతుంది. ఉదయం బయటకు వెళితే మళ్లీ తిరిగి ఇంటికి ఎప్పుడు వస్తామో తెలియని పరిస్థితి.. ఇలాంటి సందర్భాల్లో వారికి హోటళ్లు, రెస్టారెంట్లు, లేదా.. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లే దిక్కవతున్నాయి. వీరి అవసరాలను ఆసరాగా చేసుకుని ఎక్కడపడితే అక్కడ హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్టఫుడ్ సెంటర్లు వెలుస్తున్నాయి. తక్కువ ధరకే బిర్యాని, నెంబర్ వన్ క్వాలిటీ ఫుడ్ అని బ్యానర్లు తయారు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఇక్కడి వరకు బానే ఉన్నా... కస్టమర్లకు నాణ్యమైన ఫుడ్ అందించడంలో మాత్రం అలసత్వం వహిస్తున్నారు. నిల్వ చేసిన చికెన్, మాంసాన్ని బిర్యానీ చేసి కస్టమర్లకు పెడుతున్నారు. దీంతో వారు అనారోగ్యాల బారిన పడిన సందర్భాలు కోకొల్లలు. వంటనూనె మొదలు మాంసం, ఇతర నిత్యావసరాల్లో కూడా నాణ్యత పాటించడం లేదంటే ఫుడ్ బిజినెస్ చేసే వారి దందా ఏమేర సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కానరావడం లేదు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటళ్లపై దాడులు చేసి ప్రజలకు నాణ్యమైన ఫుడ్ అందేలా చూడాలని ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

**మేడ్చల్(ప్రశ్న న్యూస్ )** ఆహార ప్రియులకు, బిర్యానీ ప్రియులకు అలర్ట్. వారం మొత్తం కష్టపడి వీకెండ్ ఫ్యామిలీతో కలిసి ఏదైనా రెస్టారెంట్లకు, చిన్న చిన్న హోటళ్లకు వెళ్లి తింటున్నారా .? బిర్యానీతో పాటు దానికి తగ్గట్టుగా చికెన్ లాలిపప్స్, చికెన్ 65, చికెన్ కబాబ్స్ తింటున్నారా.? అయితే జాగ్రత్త.. మీరు తీసుకునే ఆహారం విషం లాంటిదే అని నమ్మక తప్పదు. మీరు లొట్టలేసుకుంటూ లాగించే ఆహార పదార్థాలు వారాల కొద్దీ నిల్వ ఉంచి మీకు పెడుతున్నారంటే నమ్మక తప్పదు. ప్రస్తుతం చాలా మందిలో తమ ఇంటికి ఫ్రెండ్స్ కానీ బంధువులు కానీ వచ్చినప్పుడు రొటీన్ కు భిన్నంగా ఫేమస్ రెస్టారెంట్లు, హోటళ్ల వైపు మొగ్గు చూపుతుంటాం. ఎందుకంటే పది రూపాయలు ఎక్కువైనా సరే ఫుడ్ రుచితో పాటు శుభ్రత, నాణ్యతా ప్రమాణాలు కూడా పాటిస్తారని అందులో తింటే ఆరోగ్యానికి పెద్దగా ప్రమాదం ఉండదన్న గట్టి నమ్మకం. మేడ్చల్ మండలంలో గతంలో హోటల్ ఫుడ్ తిని అనారోగ్యాల భారిన పడిన సంఘటనలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో హోటల్ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.







### నాణ్యత లేమి..

నాణ్యత లేని పప్పు దినుసులు, పౌల్ట్రీ ఫారాల్లో చచ్చిన కోళ్లని తెచ్చి వాటితో బిర్యానీ వండి మనకు వడ్డిస్తున్నారు. కొవ్వు నూనెలు, డాల్డా కలిపిన నెయ్యి, పత్తిగింజల నూనెను చాలా హోటళ్లలో ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లోనే జరుగుతుందనుకోవటం పొరపాటు. ఏసీ హోటళ్లు.. రెస్టారెంట్లలోనూ కల్తీ పెద్దఎత్తున జరుగుతోంది. మిగిలిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్లో ఉంచి వేడిచేసి వడ్డించడం, నిల్వ ఉంచిన మాంసంతో చేసిన బిర్యానీలతో, ఇతర వంటకాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సరిగ్గా ఉడికించని మాంసం తింటే అందులోని బ్రుసెల్లోసిస్ వైరస్ మనిషి శరీరంలోకి చేరుతుందని నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ మీట్ నిర్వహించిన పరిశోధనలో తేలింది. ఈ వైరస్ మనలో ఫ్లూతో సహా ఎనిమిది రకాల వ్యాధులకి మూల కారణం. మేకలు, గొర్రెలు తక్కువ ధరకు వస్తున్నాయని హోటల్ నిర్వాహకులు

### నిబంధనలు బేఖాతర్

ప్రామాణిక నిబంధనలను హోటళ్ల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు పాటించటం తప్పనిసరి. వీటి ప్రకారం.
వండిన పదార్థాలను నిల్వచేయకూడదు. తాగునీటికి ఫిల్టర్ తప్పనిసరి. వంట నూనెను ఒక్కసారికి మించి వినియోగించరాదు. మురుగు నీటికి ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. నాణ్యమైన పదార్థాలనే ఉపయోగించాలి. నిబంధనల ప్రకారం ఫుడ్ పాయిజన్ వల్ల వినియోగదారుడు మరణిస్తే హోటల్ యజమాని తగు నష్టపరిహారం చెల్లించాలి. ఆ హోటలు సీజ్ చేసి బాధ్యుడికి 6 నెలల జైలు శిక్ష విధించాలి. కానీ ఎక్కడా ఇవేం అమలు కావటం లేదు.

## ఆస్ట్రేలియా పర్యటనకు సిఎం రేవంత్

- 13న ఉన్నతస్థాయి బృందంతో వెళ్లనున్న సిఎం
- క్రీడా విశ్వవిద్యాలయ ఏర్పాటుపై పరిశీలన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 13వ తేదీన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్రంలో క్రీడావిశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పరిశీలించనున్నారు. సిఎంతో పాటు ప్రభుత్వ సలహాదారుడు జితేందర్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్, స్పోర్ట్ ఎండి సోనీ బాల, స్పోర్ట్ చైర్మన్ శివసేనా రెడ్డి వెళ్లనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈనెల 13వ తేదీ రాత్రి ఆస్ట్రేలియా బయలుదేరి వెళతారు. 14, 15, 16, 17 నాలుగు రోజుల పాటు సిఎం బృందం పర్యటించనుంది. అక్కడ క్వీన్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని ఈ బృందం పరిశీలించనుంది. తిరిగి ఈనెల 18వ తేదీన సింగపూర్‌కు ముఖ్యమంత్రి బృందం అక్కడ షాపింగ్ మాల్‌ను, క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను పరిశీలించనుంది. అదే విధంగా సింగపూర్‌లో జరుగనున్న పారిశ్రామికవేత్తల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొంటారు. అనంతరం 19వ తేదీన సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్ వెళ్లి అక్కడ 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పర్యటించనుంది. దావోస్‌లో 20 నుంచి 24వ తేదీ వరకు 5 రోజుల పాటు 'ప్రపంచ ఆర్థిక వేదిక' 55వ వార్షిక సదస్సు జరగుతుంది. సిఎంతో పాటు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు మూడు రోజులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. 2024లో దావోస్ పర్యటన సందర్భంగా సుమారు రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుత పర్యటనలోనూ మరిన్ని పెట్టుబడుల ను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ సదస్సులో 50కి పైగా దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలున్న రంగాలను చాటిచెప్పడం ద్వారా విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు దావోస్ సమావేశాల్లో 'తెలంగాణ పెవిలియన్' పేరుతో ప్రత్యేక పెట్టుబడుల సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు




**న్యూ డిల్లీ(ప్రశ్న న్యూస్ )** నూతన సంవత్సరంలో హోటళ్లు, రెస్టారెంట్‌లను నడుపుతున్న వ్యాపార యజమానులకు ఉపశమనం లభించింది. బుధవారం ఒఖఉ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గాయి. ఢిల్లీ, ముంబై సహా నగరాల్లో వాణిజ్య ఒఖఉ సిలిండర్ల (19 కిలోలు) ధరలను కేంద్ర ప్రభుత్వం 14 రూపాయలు తగ్గించింది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. దేశ రాజధానిలో 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ కొత్త ధర రూ.1804గా ఉంది. అయితే, దేశీయ ఎల్‌పిజి సిలిండర్ల ధర (14.2 కిలోలు) యథాతథంగా రూ.803గా ఉంది.కాగా, చమురు కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన గ్యాస్ సిలిండర్ ధరలను నిర్ణయిస్తాయి. ఈ క్రమంలో గత డిసెంబర్, నవంబర్ నెలల్లో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరల పెరిగాయి. ప్రభుత్వ చమురు కంపెనీలు డిసెంబర్ లో ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.16.50 పెంచాయి.

## ఈవెంట్ పార్టీకి ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో అనుమతులు ఎలా ఇచ్చారు.?

- ప్రజా పాలనలో ప్రజలను మత్తులో ముంచుతురా?
- ప్రభుత్వానికి ఆదాయ వనరులే ముఖ్యమా.?
- మందు పార్టీ లేనిదే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోరా.?
- అధికారుల పై చర్యలు తీసుకోండి




**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** ఉప్పల్ లో స్పోర్ట్స్ కోసం ఏర్పాటు చేసిన ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో ఈవెంట్‌లకు అనుమతులు ఇవ్వడమే కాకుండా న్యూ ఇయర్ సందర్భంగా లిక్కర్ పార్టీలకు కూడా అనుమతి ఇచ్చారని సమాచారం. ఈ ఘటన ఇప్పుడు ప్రజల్లో ఆగ్రహాన్ని రేపుతోంది. స్టేడియం మొత్తం పార్టీల కారణంగా అస్తవ్యస్తంగా



మారిపోయింది. ఉదయం వాకింగ్‌కు వచ్చిన కాలనీ వాసులు ఈ దృశ్యాన్ని చూసి షాక్ అయ్యారు. తమ ప్రాంతంలో ఇలా జరుగుతుందని ఊహించలేదని, స్టేడియంలో సుగంధం కాదని కేవలం దుర్గంధమే ఉందని వాపోయారు. గతంలో స్టేడియంలను క్రీడల కోసం మాత్రమే ఉపయోగించాలి అని అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఆర్థిక ప్రయోజనాల కోసం స్టేడియంలను ఈవెంట్‌లకు అనుమతించడం ఏంటి.? దీనిపై విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు.ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట, అధికారంలోకి రాగానే మరో మాట అనేది ప్రజల సందేహం. లిక్కర్ పార్టీకి కూడా అనుమతులు ఎలా వచ్చాయనే అంశంపై ప్రజలు చర్చిస్తున్నారు. మరి ఈ విషయం పై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఉప్పల్ మున్సిపల్ స్టేడియం ఘటన తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. ప్రజల ఆక్రోశం, అభ్యంతరాలను ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందో చూడాలి. క్రీడలకు వాడవలసిన స్టేడియం ను ఇలా ఈ పార్టీలకు మందు బాబుల కోసం కూడా వాడతారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## నకిలీ వెబ్‌సైట్ల జోలికి వెళ్లి డబ్బులు పొడగోట్టుకోవద్దు

- ఈవో శ్రీనివాసరావు


- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ శాఖ వెబ్సైట్ల సేవలు పొందండి
- శ్రీశైలం దేవస్థానం పేరుతో దోపిడీకి తెగబడ్డ నకిలీ వెబ్సైట్లు
- నకిలీ వెబ్సైట్లను వెంటనే తొలగించాలని భక్తుల విన్నపం







**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** శ్రీశైలంలో భక్తుల నిలువు దోపిడీ అనే కథనంపై ఆలయ ఈవో శ్రీనివాసరావు స్పందించారు. ఈ సందర్భంగా ఈవో ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ శాఖ ప్రవేశపెట్టిన రెండు వెబ్సైట్లను మరొకసారి ప్రజల ముందుకు తీసుకువచ్చారు. వీటిలో ఆన్లైన్లో రిజర్వు చేసుకొని భక్తులు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైల మల్లికార్జున దేవస్థానం కి దేశ నలుమూలల నుండి ఎంతోమంది భక్తులు వస్తుంటారు, పోతుంటారు. వాళ్ల సౌకర్యార్థం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైల దేవస్థానం ఏర్పాటుచేసిన www.srisailadevasthanam.org www.aptemples.ap.gov.in%/ వెబ్సైట్లోని భక్తులు సర్వ దర్శనం, శ్రీఘ్రదర్శనం, గదులు వంటి వాటిని ఆన్లైన్లో రిజర్వు చేసుకోవాలని ఈవో పేర్కొన్నారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు దేవస్థానం పేరుతో నకిలీ వెబ్సైట్లను ప్రవేశపెట్టి భక్తుల నుండి డబ్బులు తీసుకోవడం జరుగుతుందని దీనిని భక్తులు గమనించి నకిలీ వెబ్సైట్లో జోలికి వెళ్లకూడదని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చాలామంది భక్తులు నకిలీ వెబ్సైట్లో రూములు, దర్శనాలు రిజర్వు చేసుకుని డబ్బులు



పోడగొట్టుకుంటున్నారని అలా కాకుండా దేవస్థానం సంబంధించిన వెబ్సైట్లో మాత్రమే రిజర్వ్ చేసుకుంటే దానికి దేవస్థాన అధికారులు బాధ్యత వహిస్తారని ఈ విషయాన్ని భక్తులు గమనించి జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరగాళ్ల బారిన పడవద్దు అని ఈవో శ్రీనివాసరావు సూచించారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588